PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 230 | విజయవాడ, శుక్రవారం 24 మార్చి 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 24 March 2023 | Rs

చిక్కిపోతున్న విత్తన రాయితీ

- పరిమాణం, లబ్ధిదారులు, సబ్సిడీ తగ్గుదల
- నిబంధనలతో సర్కారు కత్తెర

లోపలి పేజీలో..

విప్లవ వీరులకు సిపిఎం ఘన నివాళి

న్యూఢిల్లీలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, సుభాషిణీ అలీ, కేంద్ర కమిటీ సభ్యులు తదితరులు

లోపలి పేజీలో..

ఎమ్మెల్సీగా ఎన్నికైన అనూరాధ, టిడిపి నాయకుల ఆనందోత్సాహాలు

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో

వైసిపికి షాక్

తెలుగుదేశం అభ్యర్థి అనూరాధ అనూహ్య గెలుపు

ఆరు స్థానాలతోనే సరిపెట్టుకున్న అధికార పార్టీ

క్రాస్ ఓటింగ్ ఫలితం • చంద్రబాబు నివాసంలో సంబరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి టిడిపి గట్టి షాక్ ఇచ్చింది. గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పంచుమర్తి అనూరాధ అనూహ్యమైన రీతిలో విజయం సాధించారు. ఈ పరిణామం వైసిపిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఎమ్మెల్యే కోటాలో ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా వైసిపి అన్ని స్థానాలకు తన అభ్యర్థులను నిలబెట్టింది. ఏడింటిని చేజిక్కించుకోవాలని తహతహలాడింది. తెలుగుదేశం పార్టీకి అసెంబ్లీలో 19 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నప్పటికీ, ఆ పార్టీ అభ్యర్థి అనూరాధకు 23 మంది శాసన సభ్యుల మద్దతు లభించడంతో ఆమె ఎవరూ ఊహించని రీతిలో విజయం సాధించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు రెబల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తారని వైసిపి ఊహించింది. అయితే వీరిద్దరే కాదు మరి కొందరు వైసిపి ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. దీంతో అన్ని స్థానాలు గెలవాలని ఆశించిన అధికార పార్టీ ఆరు సీట్లతో సరిపెట్టుకుంది. ప్రతి ఒక్కరికీ 22 ఓట్లు కావాల్సి ఉండగా టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనూరాధకు 23 ఓట్లు వచ్చాయి. మిగిలిన ఆరు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో పోతుల సునీత, ఇజ్రాయేలు, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, సూర్యనారాయణ రాజుకు 22 ఓట్లు చొప్పున వచ్చాయి. కోలా గురువులు, జయమంగళ వెంకటరమణకు 21 ఓట్లు చొప్పున వచ్చాయి. దీంతో వారికి రెండో ప్రాధాన్యత ఓట్ల కౌంటింగ్ చేపట్టారు. ఈ క్రమంలో జయమంగళ వెంకటరమణకు కావాల్సిన ఓటు రావడంతో అతను గెలుపొందినట్లు ప్రకటించారు. గెలిచిన ఏడుగురికి రిటర్నింగ్ అధికారి ఎం.టి.కృష్ణబాబు ధృవీకరణపత్రాలు అందించారు. ఉదయం పోలింగు దగ్గర నుండి సాయంత్రం వరకూ ఎన్నికల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నెల్లిమర్ల ఎమ్మెల్యే బొడ్డుకొండ అప్పలనాయుడు కుమారుడి పెళ్లి ఉండటంతో చివరిగా వచ్చి ఓటు వేశారు. ఆయన కోసం ప్రత్యేక హెలికాప్టర్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం 175 ఓట్లు పోలయినట్లు మిగతా 5లో

పోలవరం మొదటి దశ ఎత్తు

41.15 మీటర్లే

• ఇప్పటికీ పూర్తికాని సహాయ, పునరావాసం • జలశక్తి సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణం 41.15 మీటర్ల ఎత్తు వరకేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ దశకు సంబంధించిన పరిహార చెల్లింపు, సహాయం, పునరావాస కల్పన ఇప్పటికీ పూర్తి కాలేదని పేర్కొంది. లోక్‌సభలో వైసిపి ఎంపీ భీశెట్టి సత్యవతి గురువారం నాడు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు మొదటి దశ సహాయం, పునరావాసం ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పూర్తి కాలేదని ఆయన పేర్కొన్నారు.

పోలవరం కింద మొత్తం 1.06 లక్షల నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయని, తొలి దశ కిందకు 20,046 కుటుంబాలు వస్తాయని తెలిపారు. ఈ నెలాఖరు కల్లా మొదటి దశ కింద ఉన్న 20,046 కుటుంబాలకు పునరావాసం, పరిహారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అయితే ఫిబ్రవరి నాటికి కేవలం 11,677 (55.74 శాతం) కుటుంబాలకే సహాయం, పునరావాసం కల్పించినట్లు ఆయన తెలిపారు. సహాయం, పునరావాసం జాప్యంపై సమయానుగుణంగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితుల్లో 18 ఏళ్లు నిండిన వారిని ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించాలని పలువురు దరఖాస్తు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. 2005 ఏప్రిల్ 8న ప్రాజెక్టు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ నాటికి 18 ఏళ్లు నిండిన వారే అందుకు అర్హులని ఆయన తెలిపారు. అయితే ప్రాథమిక నోటిఫికేషన్ తరువాత 18 ఏళ్లు నిండిన వారు ప్రత్యేక కుటుంబాల కింద అర్హులు కాబోరని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల్లో అత్యధికులు వారే ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రివైజ్డ్ కాస్ట్ కమిటీ పోలవరం ప్రాజెక్టు కోసం 1,27,263 ఎకరాల భూమిని సేకరించాల్సిన అవసరం ఉందని నిర్ధారించిందని, అయితే 2023 ఫిబ్రవరి నాటికి 1,13,119 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన భూసేకరణ వివిధ దశల్లో ఉందని తెలిపారు. ప్రస్తుత పూర్తి షెడ్యూల్ ప్రకారం, మిగతా భూమిని 2023 డిసెంబర్ నాటికి స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు.

45.7మీటర్ల ఎత్తులోనే ప్రాజెక్టు

పోలవరం పూర్తి చేసేది నేనే : సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎంగా తొలి తొమ్మిదేళ్లపాటు పోలవరంపై కనీసంగా మాట్లాడని చంద్రబాబునాయుడికి ఆ ప్రాజెక్టుపై మాట్లాడే అర్హత లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దశాబ్దాలుగా పోలవరం ప్రాజెక్టుపై డిమాండ్ వున్నా 2004 తర్వాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డినే పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారని, ఆయన కుమారునిగా తానే ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తానని పేర్కొన్నారు. గురువారం శాసనసభలో స్వల్పకాలిక చర్చలో భాగంగా సిఎం పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్లకు పరిమితమైందని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. మొదట 41.15 మీటర్లను పూర్తి చేసి మూడేళ్లపాటు నీళ్లు నింపి, ఆ తర్వాత రెండోదశలో 45.7 మీటర్లను

పూర్తి చేస్తామని అన్నారు. మరో 18 నెలల్లో పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని చెప్పారు. మొదట తొమ్మిదేళ్ల కాలంలో ముఖ్యమంత్రిగా పని చేసినప్పుడు చంద్రబాబు పోలవరం గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదని అన్నారు. ప్రాజెక్టు కోసం ఆయన చేసింది ఏమీ లేదని, అసలు పోలవరం అనే పేరు పలికే అర్హత తెలుగుదేశానికి గాని, చంద్రబాబుకు గాని లేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చంద్రబాబు కమీషన్ల కోసం చేసిన పనుల వల్లే వరదల్లో దెబ్బతిందని చెప్పారు. అన్ని పనులు చంద్రబాబు చేశారంటూ అబద్దాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. పోలవరం నిధులను యథేచ్ఛగా దోచేశారని విమర్శించారు. ఎక్కువగా డబ్బు వచ్చే పనులను ముందు చేశారని అన్నారు. స్పిల్ వే పనుల్ని అసంపూర్ణంగా పునాదుల స్థాయిలోనే వదిలేసి, కాఫర్ డ్యాం పనుల్ని, డయాఫ్రంవాల్ పనులను చేపట్టారని తెలిపారు. అప్రోచ్ చానల్ పనులు కూడా చేపట్టలేదని అన్నారు. అసలు స్పిల్ వే పూర్తి కాకుండా కాఫర్ డ్యాం పనుల్ని ఎలా పూర్తి చేస్తారో చెప్పాలని అన్నారు. టిడిపి అనాలోచిత నిర్ణయం వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని అన్నారు. చంద్రబాబుకు పోలవరం ఎటిఎంలాంటిదని స్వయంగా ప్రధాని మోడీనే చెప్పారని గుర్తుచేశారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ అంటే పోలవరం.. పోలవరం అంటే వైఎస్ఆర్ అని అన్నారు. రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.800కోట్లు ఆదా చేశామని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో స్పిల్‌వే అప్పర్ కాఫర్ డ్యామ్ పనులను పూర్తి చేశామని తెలిపారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

• శాసన మండలిలో పిడిఎఫ్ • చర్చలు జరుపుతామని మంత్రి హామీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఇతర సమస్యలపైనా వారితో చర్చించాలని, లేదంటే మరిన్ని ఆందోళనలు నిర్వహించేందుకు అంగన్‌వాడీలు సిద్ధమవుతున్నారని వెల్లడించారు. అంగన్‌వాడీల సమస్యలపై చర్చించాలని 70వ నియమావళి కింద పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి బాలసుబ్రమణ్యం, కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ శాసన మండలిలో గురువారం నోటీసు అందించారు. ఈ సందర్భంగా వి బాలసుబ్రమణ్యం, కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.20 లక్షల మంది అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అందించే పౌష్టికాహారంలో వీరిది కీలకపాత్ర అని చెప్పారు. అంగన్‌వాడీల్లో ప్రస్తుతం వర్కర్స్‌కు రూ.11,500, హెల్పర్స్‌కు రూ.7,500 ఇస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నట్లే వర్కర్స్‌కు రూ.13,650, హెల్పర్స్‌కు రూ.7,800 పెంచాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఆ ప్రకారం కర్ణాటక ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో గ్రాట్యూటీపై

పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి బాలసుబ్రమణ్యం, ఐ వెంకటేశ్వరరావు , కెఎస్ లక్ష్మణరావు, షేక్ సాబ్జీ

ఎటువంటి విధాన నిర్ణయం చేయలేదని, 60 ఏళ్ల తరువాత పదవీ విరమణ పొందిన వర్కర్‌కు రూ.50 వేలు, హెల్పర్‌కు రూ.20 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. వారికి కూడా పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 400 జనాభా లోపు ఉంటేనే మినీ అంగన్‌వాడీలు ఉండాలని, గిరిజన ప్రాంతంలో 1000, 1200 జనాభా ఉన్నా మినీ అంగన్‌వాడీలు ఉన్నాయని తెలిపారు. వీటిని రెగ్యులర్ కేంద్రాలుగా మార్చాలని కోరారు. అంగన్‌వాడీలకు ఎలాంటి అనారోగ్య పరిస్థితులు వచ్చినా మెడికల్ లీవ్‌లు లేవని, వీటిని కూడా అమలు చేయాలని తెలిపారు. వీరి సమస్యలపై ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఈ నెల 20న పెద్దఎత్తున ఆందోళన చేస్తే వేలాది మందిని పోలీసులు అరెస్టు చేశారని గుర్తు చేశారు. వీరి సమస్యలపై చర్చించాలని అదేరోజు శాసన మండలిలో వాయిదా తీర్మానం ఇస్తే ఛైర్మన్ తిరస్కరించారని తెలిపారు. అంగన్‌వాడీ సమస్యలపై చర్చించేందుకు అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ హామీ ఇచ్చారు.

పురాతన భవనం కూలి ముగ్గురు మృతి

- విశాఖలో విషాదం

లోపలి పేజీలో..

12 కీలక రంగాలపై దృష్టి

- 2023-27 పారిశ్రామికాభివృద్ధి విధానం వెల్లడి

హైకోర్టు తరలింపు న్యాయస్థానం పరిధిలోనే

కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలోనే ఉందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాజ్యసభలో టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు రిజిజు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం హైకోర్టు అమరావతిలో ఏర్పాటయిందన్నారు. హైకోర్టును కర్నూలుకు తరలిచాలంటే హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం కలిసే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. రాజ్యాంగంలోని 214 నిబంధన, 2018లో కేంద్రం వర్సెస్ దన్ గోపాల్ రావు, ఇతరుల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, ఆంధ్రప్రదేశ్ పునర్విజన చట్టం 2014 ప్రకారం అమరావతిలో హైకోర్టు ఏర్పాటయిందని మంత్రి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు ఉమ్మడి హైకోర్టుగా హైదరాబాద్ హైకోర్టు ఉండగా, గత రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాతనే పునర్విభజన చట్టం ప్రకారం ఏపి హైకోర్టు అమరావతిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2020 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించేందుకు ప్రతిపాదించారని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు అభిప్రాయాలు వెల్లడించాల్సివుందని తెలిపారు.

హిండెన్‌బర్గ్ మరో బాంబు

- ట్విట్టర్ మాజీ బాస్ డోర్సే అక్రమాలు వెల్లడి

న్యూఢిల్లీ : గౌతం అదాని మోసాలపై నివేదిక తయారు చేసి భారత్‌లో పెను సంచలనం సృష్టించిన అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజాగా ట్విట్టర్ మాజీ సిఇఒ జాక్ డోర్సే అక్రమాలపై నివేదిక విడుదల చేసింది. 'డోర్సే ఆధ్వర్యంలోని మొబైల్ బ్యాంకింగ్ సేవల సంస్థ బ్లాక్ ఇంక్ భారీ అక్రమాలకు పాల్పడింది. బ్లాక్ ఇంక్‌కు చెందిన అండర్ బ్యాంక్ ఖాతాదారుల్లో ఎక్కువమంది నేరస్థులు లేదా అక్రమ కార్యకలాపాలలో పాల్గొన్నవారే ఉన్నారు. మోసం, ఇతర స్కామ్‌ల నిమిత్తం ఖాతాలను భారీగా సష్టించడం, ఆపై అక్రమ నిధులను త్వరత్వరగా మళ్లించడం చేసింది. మేము సమీక్షించిన ఖాతాల్లో 40 శాతం నుంచి 75 శాతం నకిలీవి, మోసానికి పాల్పడినవి లేదా ఒకే వ్యక్తితో ముడిపడి ఉన్న అదనపు ఖాతాలే. దాదాపు ఆరు దేశాల్లో ఆ కంపెనీ కార్యాలయాలను పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను వెల్లడిస్తున్నాం. తప్పుడు లెక్కలతో పెట్టుబడిదారులను తప్పుదారి పట్టించింది. ' అని హిండెన్‌బర్గ్ గురువారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది.

రాహుల్ గాంధీ దోషి

- రెండేళ్ల పాటు జైలు శిక్ష విధింపు
- పరువునష్టం కేసులో సూరత్‌కోర్టు తీర్పు
- 2019లో 'మోడీ' ఇంటిపేరుపై చేసిన వ్యాఖ్యల ఫలితం
- పైకోర్టులో అప్పీలుకు బెయిల్ మంజూరు
- 30 రోజుల పాటు శిక్ష నిలుపుదల

న్యూఢిల్లీ : పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనాయకుడు, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీని గుజరాత్‌లోని సూరత్ కోర్టు దోషిగా తేల్చింది. ఆయనకు రెండేళ్ల పాటు జైలు శిక్షను విధించింది. అనంతరం పైకోర్టులో అప్పీలుకు వెళ్లడానికి బెయిల్‌ను కూడా మంజూరు చేసింది. ఈ మేరకు శిక్షను 30 రోజుల పాటు నిలుపుదల చేసింది. 2019లో 'మోడీ' ఇంటిపేరుపై రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి ఈ శిక్ష ఖరారైంది.

భారత శిక్షా స్మృతిలోని సెక్షన్లు 499, 500 కింద రాహుల్ గాంధీ దోషిగా తేలారని న్యాయవాది కేతన్ రేషమ్‌వాలా తెలిపారు. " రెండేళ్ల జైలు శిక్షను విధించారు. అప్పీలు కోసం 30 రోజుల పాటు కోర్టు ఆయనకు (రాహుల్ గాంధీ) బెయిల్‌ను ప్రసాదించింది. శిక్ష సస్పెండ్ అయింది" అని రేషమ్‌వాలా తెలిపారు.

రాహుల్ ట్వీట్

సూరత్ కోర్టు తీర్పు అనంతరం రాహుల్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'నా మిగతా 5లో

దళిత యువకుడి హత్యకు బాధ్యులైన

పెత్తందార్లను కఠినంగా శిక్షించాలి

- బాధిత కుటుంబాలకు కెవిపిఎస్, సిపిఎం నాయకుల పరామర్శ
- మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్
- 12 మందిపై కేసుల నమోదు, అరెస్టు

రాము తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కెవిపిఎస్, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవక్షం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి నూకాలమ్మ జాతరలో చోటుచేసుకున్న వివాదం దళిత యువకుని నడిపల్లి రాము(21) హత్యకు దారి తీసింది. జాతరలో సిద్దాంతపు రవి అనే దళిత యువకుడు పెత్తందారీ కాలు తొక్కాడనే కారణంగా వివాదం నెలకొంది. దళితులపై పెత్తందారులు కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో జాతర చూసేందుకు వచ్చిన దళిత యువకుడు రాము(21) మృతి చెందాడు. మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలతో శృంగవృక్షంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. మృతుని కుటుంబాన్ని, శృంగవృక్షంలో గాయపడిన దళితులను కెవిపిఎస్, సిపిఎం నాయకులు తొలుత శృంగవక్షం గ్రామానికి చేరుకున్న నేతలు విచారణాధికారి డిఎస్‌పి అప్పారావును కలిశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సిపిఎం రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా రాష్ట్ర స్థాయిలో పోరాడుతామని హామీనిచ్చారు. ఈ ఘటనపై డిజిపికి లేఖ రాశామని తెలిపారు. ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పరామర్శించిన వారిలో కెవిపిఎస్, సిపిఎం, ఎస్ఎఫ్ఐ, మిగతా 2లో

21 మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 21 మంది డిప్యూటీ కలెక్టర్లకు ప్రమోషన్లు, బదిలీలు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలనాశాఖ జిఓ ఆర్‌టి నెంబరు 565ను గురువారం విడుదల చేసింది. బదిలీలు, ప్రమోషన్లు పొందిన అధికారులను తక్షణమే జాయినింగ్ ప్రదేశంలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది.

గ్రూప్-1 మెయిన్స్ గడువు పెంచాలి

- సిఎంకు లోకేష్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల గడువును మరో మూడు నెలలు పొడిగించాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు. తక్కువ గడువుపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీనిని అర్థం చేసుకోవాలని కోరారు. నాలుగేళ్ల తరువాత ఇచ్చిన నోటిఫికేషన్‌లలో ప్రిపరేషన్ అయ్యే గడువులో అన్యాయం చేశారని తెలిపారు.

రాష్ట్రంలో వైసిపి వ్యతిరేక పవనాలు : కాంగ్రెస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో వైసిపి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. గురువారం ఎపి భవన్‌లో రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును ఖండిస్తున్నామన్నారు. నీరవ్ మోడీ, లలిత్ మోడీ దేశం విడిచి పారిపోయారని, వారిని కలిపి చెప్తే రాహుల్ గాంధీపై కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. బిజెపి బెదిరింపులకు కాంగ్రెస్ వెనక్కు తగ్గదని, రాహుల్ గాంధీపై చేస్తున్న కుట్రలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలిపామన్నారు

శ్రీశైలం ఆలయ సరిహద్దు సమస్యకు పరిష్కారం

- మంత్రి కె సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీశైలం దేవస్థానం సరిహద్దు సమస్యను మూడుశాఖల సమన్వయంతో భూ సరిహద్దుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. అటవీశాఖతో చాలా కాలంగా కొనసాగుతున్న భూ వివాదం పరిష్కారం కోసం అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కమిటీ ఏర్పాటు చేసి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించామన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అటవీ, దేవాదాయ, రెవెన్యూశాఖలతో ఓ ఎంఒయు కుదుర్చుకున్నామని, శ్రైశైలక్షేత్రం, సాక్షి గణపతి, హటకేశ్వరం ముఖద్వారం వద్ద అభివృద్ధి పనులకు అవసరమైన 360 ఎకరాల అటవీ భూముల సేకరణ కోసం కేంద్ర అటవీశాఖకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. దేవస్థానానికి చెందిన 4,430 ఎకరాల భూమికి స్కెచ్‌లతో సహా సరిహద్దులు నిర్ణయించామని పేర్కొన్నారు.

త్వరలోనే బిల్లుల చెల్లింపు

- మంత్రి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను కాంట్రాక్టర్లకు త్వరలోనే చెల్లిస్తామని మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. విజయవాడలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో రాష్ట్రస్థాయి ఉపాధిహామీ మండలి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉపాధి హామీ అమలు తీరును ప్రతిబింబించే 7 రిజిస్టర్లను సక్రమంగా నిర్వహిస్తున్నారని చెప్తూ ఉపాధి హామీ మండలి సభ్యుల సూచన మేరకు పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానించేలా కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.

శ్రీనాథ్‌రెడ్డికి కొమ్మినేని నివాళి

- ఎన్‌ఎజె, ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ డి శ్రీనాథ్‌రెడ్డికి ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు నివాళులర్పించారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని శ్రీనాథ్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్రంలో జర్నలిస్టుగా శ్రీనాథ్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి జర్నలిజానికి తీరని లోటని కొమ్మినేని పేర్కొన్నారు.

శ్రీనాథ్‌రెడ్డి మృతిపట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ (ఎన్‌ఎజె), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎపిబిజెఎ) తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఎన్ కొండయ్య, ఎ అమరయ్య, ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, వి శ్రీనివాసరావు, కె మునిరాజు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా శ్రీనాథ్‌రెడ్డి పనిచేశారని అన్నారు. ఆయన మరణం యువ జర్నలిస్టులకు ఎంతో లోటని పేర్కొన్నారు. జర్నలిస్టులందరినీ ఒక్కతాటిపై తీసుకొచ్చేందుకు ఆయన ఎంతగానో ప్రయత్నం చేశారన్నారు. శ్రీనాథ్‌రెడ్డి మరణం పట్ల ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

12 కీలక రంగాలపై దృష్టి

- 2023-27 పారిశ్రామికాభివృద్ధి విధానం వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నూతన పారిశ్రామికాభివృద్ధి విధానం 2023-27 (ఐడిపి-2023-27)ను ప్రకటించింది. 2023 ఏప్రిల్1 నుంచి అమల్లోకి వచ్చే ఈ విధానం నాలుగేళ్లపాటు అమల్లో ఉంటుంది. 2020-23 పారిశ్రామికాభివృద్ధి విధానం ముగియడానికి వారం రోజుల ముందే ఈ నూతన విధానానికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. సామాజికంగా, ఆర్థికంగా ప్రాధాన్యత కలిగిన 12 రంగాలపై ఈ నూతన విధానం కేంద్రీకరించింది. జాతీయ, అంతర్జాతీయ ధోరణులను గమనంలో ఉంచుకుని రూపొందించిన ఈ ఐడిపిని టెక్స్‌టైల్స్ రంగాలకు సహా వివిధ రంగాలకు వర్తింపజేయనున్నారు. విదేశీ పెట్టుబడులు, ఉపాధి కల్పించే చిన్న మధ్యతరహా పరిశ్రమలు, స్టార్టప్ వెంచర్లు, లాజిస్టిక్ హబ్‌లు, సేవల రంగం, మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపింది.

ఈ కొత్త విధానం ఆర్థిక వృద్ధికి తొమ్మిది మూల స్తంభాల గురించి నొక్కి చెప్పింది. పోర్టుల ఆధారిత అభివృద్ధి, లాజిస్టిక్స్ ఎకోసిస్టమ్ పేరిట కొత్తగా ఓడరేవుల నిర్మాణంపైనా దృష్టి సారించనున్నారు. పారిశ్రామిక వాడలను నిర్మించి పెట్టుబడులు పెట్టేవారు వెంటనే ఉత్పత్తి ప్రారంభించేలా చూడాలని, ప్లగ్ అండ్ ప్లే విధానం కోసం అన్ని ఏర్పాట్లు ముందుగానే చేయాలని నిర్ణయించారు. అలాగే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'రెడీ టు ఆక్యుపై ఇండస్ట్రియల్ స్పేసెస్'ను పెంపొందించడం, మహిళలు, మైనార్టీలు, అణగారిన వర్గాలు అభివృద్ధిలో భాగస్వాములును చేసే పరిశ్రమలు, స్టార్టప్‌లను పటిష్టపరచడం వంటివాటికి అధిక ప్రాధాన్యమిస్తామని ఐడిపి పేర్కొంది. కొత్త పెట్టుబడులకు ఎలాంటి ఆటంకం లేకుండా త్వరిత గతిన అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ డెస్కులను వైఎస్ఆర్ ఎపి వన్ ద్వారా ఏర్పాటు చేస్తారు.

విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్, చెన్నై - బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పైనా ప్రత్యేక దృష్టి సారించాలని, దీనికి అనుసంధానంగా కొత్త పరిశ్రమలు వచ్చేలా చూడాలని ఐడిపి పేర్కొంది. మూలధన పెట్టుబడిపై మాత్రమే వంద శాతం ప్రోత్సాహకాలు ఇవ్వాలని, అది ఏడాదికి 20 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించారు. వీటితోబాటు బ్రౌన్‌ఫీల్డు ప్రాజెక్టులకు ఈ రాయితీలను 50శాతం, అంతకు మించి ఇవ్వొచ్చని పేర్కొంది. ఐడిపి కేంద్రీకరించిన కీలకమైన 12 రంగాల్లో కెమికల్స్, పెట్రో కెమికల్స్, ఫార్మాసుటికల్స్,బల్క్ డ్రగ్స్, టెక్స్‌టైల్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటి, ఆగ్రో ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, వైద్య పరికరాలు, రక్షణస్త్ర, ఎయిరో స్పేస్, మెషినలరీ ఎక్విప్‌మెంట్, పునరుత్పాదక ఇంధనం, మానుఫాక్చరింగ్, బయోటెక్, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వెహికల్స్ వంటివి ఉన్నాయి.

'ఉక్కు'ను ప్రయివేటీకరిస్తే గుణపాఠం తప్పదు

- రా మెటీరియల్‌ను అడ్డుకోవడంపై ఉక్కు నేతల హెచ్చరిక

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 770వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో అన్ని విభాగాల ఉక్కు కార్మికులు కుర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నేతలు వరసాల శ్రీనివాసరావు, పి శ్రీనివాస్, నరేంద్ర, వెంకటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న, నాయుడు మాట్లాడారు. ఉక్కు ఉత్పత్తికి అవసరమైన రా మెటీరియల్ రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమన్నారు. ప్లాంట్ నష్టాల నుంచి బయటకు రావడానికి సుమారు రూ.మూడు వేల కోట్లు ఖర్చవుతోందని, ఈ క్రమంలో బ్యాంకుల నుంచి రుణం పొందే తరుణంలో రా మెటీరియల్ రాకుండా అడ్డుపడటం దుర్మార్గమని అన్నారు. అప్పులకు వడ్డీలు సకాలంలో చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కు కర్మాగారమేనని తెలిపారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడానికి జరుగుతున్న కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామని స్పష్టం చేశారు.

బిజెపి కక్షసాధింపు ధోరణి మానుకోవాలి : కె నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణి మానుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ వ్యాఖ్యానించారు. విజయవాడలోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరువునష్టం దావాలో సూరత్ హైకోర్టు రాహుల్ గాంధీకి రెండేళ్ళ జైలుశిక్ష విధించటాన్ని తప్పుబట్టారు. 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ పోటీ చేయకుండా చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్ గ్యాంగ్, మోడీ మిత్రులు రూ.16 లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయారని చెప్పారు. గవర్నరు వ్యవస్థను అప్రదిష్టపాలు చేస్తున్నారని విమర్శించారు. వివిధ రాజకీయ పార్టీలతోపాటు సిపిఐ, సిపిఎం ఒక్కతాటిపై ఉండి బిజెపికి వ్యతిరేకంగా పోరాడి ఓడించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కక్షపూరిత పాలన సాగిస్తున్నారన్నారు. మూడు రాజధానులు తప్పుడు నిర్ణయమని, దాన్ని సమర్థించుకోవడం కోసం అనేక తప్పులు చేస్తున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 141.5 అడుగులుగా నిర్ణయిస్తే ఆ ప్రాజెక్టు ఎందుకూ ఉపయోగపడదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

వాటర్ స్కీమ్‌లలోని ఉద్యోగులకు వేతనాలు చెల్లించండి

- మంత్రి బూడి ముత్యాలనాయుడుకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నీలకంఠాపురం, శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్‌లు, శ్రీ సత్యసాయి వాటర్ స్కీమ్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు బకాయిలతో కలిపి మొత్తం వేతనాలకు, స్కీమ్‌ల నిర్వహణ కోసం నిధులను కేటాయించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సిఐటియు అనుబంధ సంఘాలైన నీలకంఠాపురం, శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ వర్కర్స్ యూనియన్, శ్రీ సత్యసాయి వాటర్ స్కీమ్ వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యాన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడుకు వినతిపత్రం అందజేశాయి. వినతిపత్రం అందించిన వారిలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, యూనియన్ గౌరవాధ్యక్షులు జి ఓబులు, నాయకులు హెచ్ తిప్పేస్వామి, వి సంజన్న ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫ్లోరైడ్ నుంచి రక్షణ కల్పించేందుకు భగవాన్ సత్యసాయిబాబా ట్రస్టు సహకారంతో రూ.380 కోట్లతో చేపట్టిన మంచినీటి ప్రాజెక్టు నిర్వహణ నుంచి ఎల్‌అండ్‌టి సంస్థ తప్పుకోవడంతో ప్రాజెక్టు మొత్తం ప్రశ్నార్థకంగా తయారైందని మంత్రికి వివరించారు. వేతనాలు ఇవ్వకపోవడంతో 572 మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. నీలకంఠాపురం, శ్రీరామిరెడ్డి ప్రాజెక్టులకు కూడా నిధులు ఇవ్వకపోవడంతో ఆ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న 600 మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు ఇవ్వడంతోపాటు ఉద్యోగుల వేతనాలను బకాయిలతో కలిపి చెల్లించాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ, కనీస వేతనాల చట్టాలను అమలు చేయాలన్నారు. సిబ్బందికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్కీమ్‌ల కింద ఉన్న ప్రతి పంప్‌హౌస్‌కు రక్షణగా ప్రహరీలు నిర్మించాలన్నారు.

విప్లవ వీరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

- భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

23 ఏళ్ల వయసులోనే సోషలిజమే భారతదేశానికి అంతిమ లక్ష్యం అని నమ్మి స్వాతంత్ర్యం కోసం పోరాడి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ప్రాణత్యాగం చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కొనియాడారు. వారి స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని సంరక్షించుకోవడానికి ప్రజా పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. స్వాతంత్య్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 92వ వర్ధంతిని విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ మరణించిన తరువాత 16 ఏళ్లపాటు దేశం నలుమూలలా పోరాటాలు వెల్లువెత్తాయని తెలిపారు. వీర తెలంగాణ సాయుధ పోరాటం, చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాటం, కూలి, రైతాంగ, సైనిక, నావికా దళ పోరాటాలు బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయన్నారు. ఆనాడు ఈస్టిండియా కంపెనీ దేశాన్ని దోచిందని, ఈనాడు మోడీ ప్రభుత్వం మైన్స్, భూమి, నీరు, అడవులు, పోర్టులు అన్నిటినీ కార్పొరేట్లకు, అదానీకి కట్టబెడుతోందని అన్నారు. హిండెన్‌బర్గ్ నివేదికతో అదానీ మోసం బయటపడినా.. ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిస్సిగ్గుగా అదానీ కోసమే పనిచేస్తున్నాయని అన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టి, కేంద్రం చెప్పినట్టల్లా ఆడుతోందన్నారు. గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వ షేర్లను అడ్డదారిలో అదానీకి కట్టబెట్టారని అన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి)పై ఒత్తిడి తెచ్చి ఈ పోర్టు ద్వారా చమురు ట్రాన్స్‌పోర్టు చేసుకునేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు. సాగు భూములకు ఇవ్వాల్సిన నీటిని హైడ్రో ప్రాజెక్టు కోసం అదానీకి, షిర్డిసాయి కంపెనీకి కేటాయించడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం 'అదానీ.. క్విట్ ఆంధ్రప్రదేశ్' నినాదాన్ని తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ పుణ్యవతి మాట్లాడుతూ.. మరణించే కొద్దిసమయం ముందు కూడా భగత్‌సింగ్ లెనిన్ రాసిన 'రాజ్యం-విప్లవం' పుస్తకాన్ని అధ్యయనం చేశారని తెలిపారు.

స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్‌తోపాటు రామ్‌ప్రసాద్ బిస్మిల్లా, అష్ఫతుల్లా ఖాన్ వంటి ఎంతోమంది అమర వీరులు మతాలకతీతంగా పోరాటాలు చేశారని గుర్తు చేశారు. స్త్రీలంటే తమ వెంట నడిచేవారు, గడప దాటనీయకూడదన్న హీన భావాన్ని ఆర్‌ఎస్‌ఎస్ నాటుతోందని, స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొంటూ భగత్‌సింగ్‌ను పోలీసుల కళ్లుగప్పి తప్పించిన దుర్గాబాబీ, మాస్టర్ సూర్యసేన్ నాయకత్వంలో పోరాడి ప్రాణాలు కోల్పోయిన ప్రీతీలతా వడేదార్ వంటి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడారన్నారు. మన రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్ వంటి వీరులు గిరిజనుల్లో చైతన్యం తెచ్చి పోరాటం చేశారన్నారు. కానీ మోడీ సర్కారు గిరిజనులను భూముల నుంచి గెంటివేస్తున్నదని, వారి హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. కార్పొరేట్లకు భూములు కట్టబెట్టడానికి గిరిజనుల రక్షణ కోసం ఉన్న చట్టాలను నాశనం చేస్తోందన్నారు. భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశామని, ప్రతి ఒక్కరూ తమ బిడ్డలను దేశం కోసం.. ప్రజల కోసం ఆలోచించేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె జయరామ్ ప్రతిజ్ఞ చేయించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె స్వరూపరాణి, పి మురళీకృష్ణ, బి

మైనార్టీల సంక్షేమానికి రూ.21,756.69 కోట్లు

- డిప్యూటీ సిఎం అంజాద్ బాషా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మైనార్టీల సంక్షేమానికి 2019 నుంచి ఇప్పటి వరకూ రూ.21,756.69 కోట్లు ఖర్చు చేసినట్లు డిప్యూటీ సిఎం అంజాద్ బాషా తెలిపారు. మైనార్టీల సంక్షేమంపై శాసనసభలో గురువారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం అంజాద్ బాషా మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమాల కింద 26 పథకాలకు గానూ 32,90,205 మంది లబ్ధిదారులకు రూ.11,188.42 కోట్లను డిబిటి ద్వారా అందజేశామన్నారు. నాన్ డిబిటి కింద 10 పథకాలకు సంబంధించి 16,80,156 మంది లబ్ధిదారులకు రూ.10,568.27 కోట్లను అందజేశామన్నారు. ఇబిసి నేస్తం గురించి బలహీనవర్గాల సంక్షేమశాఖ గురించి పి శ్రీనివాసరావు, పూర్ణచంద్ర ప్రసాద్, శ్రీనివాసనాయుడు అడిగిన ప్రశ్నకు వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. 2021-22 ద్వారా 3,98,963 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.598.44 కోట్లు ఖర్చు చేశామన్నారు. లబ్ధిదారులను గ్రామ సచివాలయాల ద్వారా ఆరు దశల ధ్రువీకరణ ప్రకారం ఎంపిక చేసి ఎంపిడిఒలు, ఇడిలు, జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. 45 నుంచి 60 ఏళ్లకు చెందిన ఇబిసి మహిళలకు మూడేళ్ల కాలంలో ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థికసాయం ఈ పథకం సమకూర్చుతోందన్నారు. 2023 నాటికి ప్రభుత్వం నిర్ణయించిన 1.50 లక్షల మంది లబ్ధిదారుల్లో 48,416 మంది అర్హులకు టిడ్కో ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందన్నారు. మిగిలిన 1.12 లక్షల ఇళ్లను 2023 జూన్/డిసెంబరు నాటికి అందించాలని ప్రతిపాదించామన్నారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకం గురించి జరిగిన చర్చలో మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. ఈ పథకం కింద ఇప్పటి వరకు 4,536 మంది లబ్ధిదారులకు రూ.38,17,65,000ను ఆర్థికసాయం అందించామన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం గురించి కైలే అనిల్‌కుమార్, కంబాల జోగులు, టిజెఆర్ సుధాకర్‌బాబు, గొల్ల బాబూరావు అడిగిన ప్రశ్నకు మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. సిఎం చొరవతో రూ.268.46 కోట్ల వ్యయంతో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు తగిన గుర్తింపు వచ్చిందన్నారు. స్వరాజ్ మైదాన్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణం ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

పట్టణాల్లోనూ ఆస్తి హక్కు నిర్ధారణ

- మున్సిపల్ చట్ట సవరణకు శాసనసభ ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామాల్లో చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు సమగ్ర సర్వే తరహాలో పట్టణాలు, నగరపాలక సంస్థల పరిధిలోనూ ఆస్తి హక్కుదారుల నిర్ధారణకు త్వరలో సర్వే చేపట్టేందుకు రూపొందించిన ఎపి మున్సిపల్ చట్టసవరణకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన బిల్లును మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ గురువారం సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరపాలక సంస్థల్లో 10 లక్షల కుటుంబాల ఆస్తులను మదింపు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని మిగతా మున్సిపాలిటీల్లో కోటి 53 లక్షల మందికి చెందిన దాదాపు 80 లక్షల మంది ఆస్తులను గుర్తించి, వారికి హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆస్తుల విలువ మదింపు కూడా చేయాలన్నారు. ఆస్తుల బదలాయింపునకు ఉద్దేశించిన చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టగా ఆమోదించారు. 2007 నుంచి ఉన్న టిడిఆర్ బాండ్ల అంశం కూడా ఈ చట్టం పరిధిలోకి వస్తుందన్నారు. షెడ్యూల్డు కులాలు, తెగలకు సబ్‌ప్లాన్ చట్ట సవరణకు శాసనసభ ఆమోదించింది. ప్లానింగ్, కేటాయింపులు, ఆర్థిక వనరుల ఉపయోగం కోసం ఉద్దేశించిన ఈ బిల్లును మంత్రి మేరుగ నాగార్జున ప్రతిపాదించారు. రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చట్టసవరణకు ఉద్దేశించిన బిల్లును కూడా మంత్రి నాగార్జున ప్రతిపాదించగా ఆమోదించారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్రాంట్ చట్ట సవరణ బిల్లును మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. ఎస్‌టి కమిషన్ చట్టసవరణ బిల్లును ఉప ముఖ్యమంత్రి పి రాజన్నదొర ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది.

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి బివి రాఘవులు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాలుగు రోజుల క్రితం వీచిన ఈదురుగాలులు, వడగండ్ల వానల వల్ల అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పంటలు భారీగా నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవడానికి అసాధారణ స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు విజ్ఞప్తి చేశారు. నష్టపోయిన వారికి ఆత్మవిశ్వాసం కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే కొంత ఎక్స్‌గ్రేషియో విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన గురువారం లేఖ రాశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి, ప్రత్యక్షంగా పంట నష్టాన్ని పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతపురం జిల్లాలో 16 మండలాల్లో 11,052 ఎకరాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిని రూ.211.91 కోట్లు నష్టం జరిగినట్లు ఆ జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిసిందని, వాస్తవ పరిస్థితి అంతకు రెండింతలకుపైగా ఉందని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోనూ అసాధారణంగా పంటలు నష్టపోయాయని తెలిపారు. అనంతపురం జిల్లా నార్పల మండలం నాయనపల్లి, కేతేపల్లి, వెంకటాంపల్లి, శ్రీసత్యసాయి జిల్లాలో మూర్తిపల్లి గ్రామాల్లో పంట పొలాలను పార్టీ బృందంతో కలిసి స్వయంగా పరిశీలించినట్లు వివరించారు. ఆయా గ్రామాల్లో అరటి, మొక్కజొన్న, టమోటా, బత్తాయి, దానిమ్మ, బొప్పాయి, కరివేపాకు పంటలకు అసాధారణంగా నష్టం వాటిల్లిందని, రైతుల పరిస్థితి హృదయ విదారకంగా ఉందని తెలిపారు. అనంతపురం జిల్లాలో అత్యధిక పంటలు నష్టపోయిన నార్పల మండలం నాయనపల్లి, వెంకటాంపల్లి, కేశపల్లి గ్రామాల్లో వారం, పదిరోజుల్లో కోత దశలో ఉన్న 580 ఎకరాల్లో అరటి తోటలు నేలకొరిగి పూర్తిగా నష్టం వాటిల్లిందని వివరించారు. అరటికి ఎకరాకు రూ.1.30 లక్షల నుంచి రూ.లక్షా 50 వేల వరకు పెట్టుబడి అయినట్లు రైతులు తెలిపారని పేర్కొన్నారు. అరటి టన్ను రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఉందని, ఈ గ్రామాల్లోనే సుమారు రూ.50 కోట్లు వరకు నష్టం వచ్చిందని పేర్కొన్నారు. ఈ మండలం కేశపల్లి గ్రామంలో చీని చెట్లు చీలిపోవడం, దాని చిగుర్లు పూర్తిగా రాలిపోవడం వడగండ్ల వాన తీవ్రతను తెలియజేస్తోందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి రూరల్ మండలంతోపాటు మరికొన్ని గ్రామాల్లో మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోయిందని, కొన్ని గ్రామాల్లో పంట పూర్తయిన దశలో ఈ నష్టం జరిగిందని తెలిపారు. దెబ్బతిన్న పంటలను అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యానవన శాఖాధికారులు పర్యటిస్తున్నారని, ఇ-క్రాప్ బుకింగ్‌లో వాస్తవ సాగుదారుపేరు లేకపోయినా పంట నష్టం ఆధారంగా సంబంధిత రైతు పేరు నమోదు చేసి పరిహారం చెల్లించాలని కోరారు. పంటల సాగుకు పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని, నార్పల మండలం వెంకటాంపల్లి గ్రామంలో రాజు 12 ఎకరాలు ఎకరాకు రూ.25 వేలు కౌలుకు తీసుకుని అరటితోట సాగు చేశారని, పెట్టుబడి ఎకరాకు లక్షా 20 వేలు పెట్టి మొత్తం పంటను నష్ట పోయారని తెలిపారు. భూ యజమాని పేరుతో ఇ-క్రాప్ బుకింగ్ ఉందని, ఇలాంటి వాస్తవ పరిస్థితులను గుర్తించి వాస్తవ సాగుదారులకు పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

రామును హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలి : సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన దళిత యువకుడు నడిపల్లి రాముపై దాడి చేసి హత్య చేసిన అగ్రకుల దురహంకారులను ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం ప్రకారం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు డిజిపికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం లేఖ రాశారు. శృంగవృక్షంలోని గ్రామదేవత జాతరకు వెళ్లిన దళిత యువకులపై కులదురహంకారంతో దాడి చేశారని, దళితపేటలోకి వెళ్లి వారి ఇళ్లల్లో ఉన్నవారిపై దాడి చేసి అనేక మందిని గాయపరిచారని, ఈ క్రమంలోనే దళిత యువకుడు రాము మృతి చెందారని తెలిపారు. దాడికి నాయకత్వం వహించిన ముఖ్యుల్ని ఇంతవరకూ అరెస్టు చేయలేదని, కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడితో గ్రామంలోని దళితులు భయకంపితులై బతుకుతున్నారన్నారని తెలిపారు. బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, పల్లెలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని, రాము కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, రెండెకరాల స్థలం, ఇల్లు కట్టివ్వాలని, ఇతర బాధితులకు రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, దళితవాడకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దళితులకు రక్షణ చర్యలు తీసుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, రాష్ట్రంలో అనేకచోట్ల దళితులపై దుర్మార్గమైన దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన ఘటనల్లో తక్కువ సెక్షన్‌లతో కేసులు నీరుగారుస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం కలెక్టరు, ఎస్‌పి శృంగవృక్షం గ్రామాన్ని సందర్శించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగతంగా శ్రద్ధపెట్టి బాధితులకు న్యాయం జరిగేటట్లు చూడాలని లేఖలో కోరారు.

వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి

- 'దేశానికీ మోదానీ ముప్పు' పుస్తకావిష్కరణలో ఉండవల్లి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దేశంలో జరుగుతున్న వాస్తవాలను, పరిణామాలను ప్రజల దృష్టికి తీసుకువచ్చేందుకు పుస్తకాలను ప్రచురించడం మంచి కృషి అని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. 'దేశానికి మోదాని ముప్పు' పుస్తకాన్ని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాల్లో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉండవల్లి మాట్లాడుతూ.. ప్రజలకు వాస్తవాలు ఎప్పటికప్పుడు వివరించేందుకు పుస్తకాలు ప్రచురణ చేయడం అభినందనీయమన్నారు. దేశ సంపదను మోడీ, అమిత్‌షాలు అమ్మేయడం... అంబానీ, అదానీలు కొనుక్కోవడం అనేది నేడు దేశంలో జరుగుతుందన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. వాస్తవాలన్ని ప్రజలకు వివరించడానికి సిపిఎం రాష్ట్ర కమిటీ ఈ పుస్తకాన్ని ముద్రించిందని తెలిపారు.

వైసిపి పతనం ప్రారంభం : టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి పతనం ప్రారంభమైందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయం సాధించడంతో ఉండవల్లిలో చంద్రబాబు నివాసం వద్ద అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. ఒక ఎమ్మెల్సీ స్థానం రావడానికి 22 మంది ఎమ్మెల్యేలు అవసరమని, తమ పార్టీకి 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని తెలిపారు. తమ పార్టీ ఎమ్మెల్యే భవాని ఓటు వేయడానికి రాకుండా చేయాలని, ప్రభుత్వం భయాందోళనకు గురిచేసిందన్నారు.

పెత్తందార్లను కఠినంగా శిక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

డివైఎఫ్ఐ ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని ధర్నా

మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని మృతుని కుటుంబ సభ్యులు, దళితులతో కలిసి కెవిపిఎస్, సిపిఎం ఆధ్వర్యంలో గురువారం తొండంగి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఇచ్చి ఆదుకోవాలన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రధాన నిందితులైన అడపా సురేష్, బస్సా గంగాధర్‌లను ఎ1, ఎ2లుగా చేర్చాలన్నారు. అనంతరం తహశీల్దార్ బాల సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందించారు.

12 మందిపై కేసు నమోదు, 11 మంది అరెస్ట్

మృతుని తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు హత్య, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టంలోని 143, 147, 148, 302, 324, ఆర్‌డబ్ల్యు 149 సెక్షన్‌ల కింద దాడి చేసిన వారిపై తొండంగి పోలీస్ స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు ఆదేశాల మేరకు కందికొండ లోవదొర, అడపా సాయిభాస్కర్, బొబ్బది వెంకటేష్, బస్సా మణికంఠ, కందా మణికంఠ, గుడా వంశీ, మానం శ్రీనివాస్, బస్సా శివశంకర్, బొట్టు సత్తిబాబు, అడపా సురేష్, బస్సా గంగాధరరావులను గురువారం మధ్యాహ్నం అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి బి.అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో నిందితుడు పాలపర్తి అచ్చెన్న పరారీలో ఉన్నాడని తెలిపారు. అతని కోసం గాలిస్తున్నామన్నారు. దళిత యువకుడు హత్యకు గురైన ప్రాంతాన్ని కాకినాడ జిల్లా ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు బుధవారం పరిశీలించారు.

టిటిడి వార్షిక బడ్జెట్ రూ. 4,411.68 కోట్లు

- 'శ్రీ లక్ష్మీ శ్రీనివాస' సిబ్బందికి రాయితీపై లడ్డు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

2023- 24 ఆర్థిక సంవత్సరానికి రూ 4,411.68 కోట్ల బడ్జెట్‌ను ధర్మకర్తల మండలి ఆమోదించిందని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. బడ్జెట్ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదముద్ర వేసిందని ఆయన వివరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఇఒ. ఎవి ధర్మారెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. 'కోవిడ్ తరువాత హుండీ ఆదాయం గణనీయంగా పెరిగింది. కోవిడ్‌కు ముందు ఏడాదికి రూ.1200 కోట్ల కానుకలు లభించేవి. కోవిడ్ తరువాత రూ.1500 కోట్ల ఆదాయం పెరిగింది. బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్ల మీద వడ్డీ రేట్లు పెరిగాయి. భక్తుల కోరిక మేరకు కోవిడ్ సమయంలో వర్చువల్ సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో జారీ చేశాం. ఈ సేవలు కొనసాగించాలని నిర్ణయించాం. అలిపిరి నుంచి వకుళామాత ఆలయం వరకు కొత్తగా రోడ్డు మంజూరు చేశాం. వేసవిలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున విఐపి సిఫార్సు లేఖలను తగ్గించాలని నిర్ణయించాం. లడ్డు కాంప్లెక్స్ వద్ద 30 అదనపు లడ్డు కౌంటర్ల నిర్మాణానికి రూ 5.25 కోట్లు మంజూరు చేశాం. తమిళనాడు రాష్ట్రం ఉలందూర్‌పేటలో నిర్మిస్తున్న శ్రీవారి ఆలయంలో రూ 4.70 కోట్లతో కొన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి నిర్ణయించాం. తిరుపతిలోని ఎస్‌విఐఎస్ ఆర్ట్ కళాశాల పడమర వైపు మూడో అంతస్తు నిర్మాణం, ల్యాబ్ ఆధునీకరణ, గ్రంథాలయం, ఇండోర్ గేమ్స్ భవనాల నిర్మాణం తదితర పనుల కోసం రూ. 4.71 కోట్లతో టెండర్లు ఖరారు చేశాం. శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులతో కలిపి దర్శనం, వసతి, రాయితీపై రూ 20 చొప్పున నెలకు పది లడ్డూలు అందించేందుకు నిర్ణయం తీసుకున్నాం. ఫిబ్రవరి 15న సమావేశం జరిగినా.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈ వివరాలను వెల్లడించలేదు' అని సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జెఇఒ సదా భార్గవి, ఎస్‌వి జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

'జూన్' శ్రీవారి ఆర్జిత టికెట్లు విడుదల

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను గురువారం ఉదయం టిటిడి విడుదల చేసింది. అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆర్జిత సేవ టికెట్లతో పాటు అంగప్రదక్షిణం, వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా టికెట్లను విడుదల చేసింది. మిగతా ఆర్జితసేవా టికెట్లకు ఆన్‌లైన్ లక్కీడిప్ నమోదు ప్రక్రియ మార్చి 24న మొదలవుతుంది.

చిక్కిపోతున్న విత్తన రాయితీ

- పరిమాణం, లబ్ధిదారులు, సబ్సిడీ తగ్గుదల
- నిబంధనలతో సర్కారు కత్తెర

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతులకు విత్తన రాయితీ ఏడాదేడాది చిక్కిపోతోంది. మూడేళ్లలో ప్రభుత్వం రైతులకు రాయితీపై పంపిణీ చేసిన విత్తనాల పరిమాణం, లబ్ధిదారులు, సబ్సిడీ అమౌంట్ అంతకంతకూ కుంచించుకుపోతోంది. గడచిన మూడు సంవత్సరాల్లో తుపాన్లు, భారీ వర్షాలు, వరదలు, అక్కడక్కడ వర్షాభావం, డ్రైస్పెల్స్ వంటి విపత్తులు సేద్యాన్ని దెబ్బతీశాయి. పంట నష్టపోయిన రైతులు తిరిగి పంటలేసుకునేందుకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలిస్తున్నామని ఊదరగొట్టారు. సాధారణ ప్లాన్‌తో పాటు కంటింజెన్సీ ప్లాన్ అదనంగా ఇచ్చామంటున్న విత్తనాలతో కలుపుకున్నా పంపిణీ చేసిన విత్తనాల పరిమాణం, లబ్ధిదారుల సంఖ్య, రాయితీ సొమ్ము ఏటేటా తగ్గుతూనే ఉంది. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)లో డి-కృషి యాప్ ద్వారా పంపిణీ చేస్తోంది. భూమి రికార్డుల ప్రకారం ఉన్న వారికే యాప్‌లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రికార్డుల్లేని కౌలు రైతులకు రాయితీ విత్తనాలు అందట్లేదు. సిసిఆర్‌సిలు ఉన్న కౌల్దార్లకు విత్తనాలిస్తున్నా వారి సంఖ్య బహు స్వల్పం.

భారీ కోత

2020-21లో ఖరీఫ్, రబీ కలుపుకొని 8.41 లక్షల క్వింటాళ్లు 16.15 లక్షల మంది రైతులకు పంపిణీ చేశారు. అందుకోసం రూ.216.02 కోట్లు ఖర్చు చేశారు. 2021-22లో 10.09 లక్షల క్వింటాళ్లు 16.37 లక్షల మందికి పంపిణీ చేశారు. రూ.265.31 కోట్లు వ్యయం చేశారు. ఆ ఏడాది నివార్ తుపానొచ్చి రైతులు పంట నష్టపోవడంతో రబీలో నార్మల్ ప్లాన్‌కు అదనంగా ఇండెంట్ పెట్టారు. ఆ కారణంగా ఈ సంవత్సరం సబ్సిడీ విత్తనాల పరిమాణం అంతమేరకు కొంత పెరిగింది. పెరిగిన లబ్ధిదారులు 20 వేల మాత్రమే. ఖరీఫ్‌లో 80 వేల క్వింటాళ్లు, సుమారు 2.80 లక్షల లబ్ధిదారులు తగ్గారు. 2022-23లో రెండు సీజన్లూ కలుపుకొని 6.85 లక్షల క్వింటాళ్లు 11.92 లక్షల మందికి పంపిణీ చేశారు. రూ.189.71 కోట్లు ఖర్చు చేశారు. మునుపటి సంవత్సరంతో కంటే ఈ తడవ 80 వేల క్వింటాళ్ల విత్తనాల పంపిణీ తగ్గింది. దాదాపు 4 లక్షల మంది లబ్ధిదారులూ తగ్గారు.

బయటే తక్కువ

రాయితీ విత్తనాలను పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కింద పంపిణీ చేస్తున్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు ప్రోత్సాహం, ఇత్యాది స్కీంల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మ్యాచింగ్ గ్రాంట్లతో రైతులకు సబ్సిడీ విత్తనాలిస్తున్నారు. నిర్ణయిస్తున్న సబ్సిడీ కొన్ని పంటలకే 50 శాతం. కొన్నింటికి అంత కంటే తక్కువ రాయితీ ఇస్తున్నారు. విపత్తుల వంటి ప్రత్యేక సమయాల్లో మాత్రం 80 శాతం వరకు రాయితీ ఇస్తున్నారు. వాటి పంపిణీ చాలా తక్కువ. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాల్లో వేరుశనగ పరిమాణం 70 శాతం వరకు ఉంటుంది. రైతుల అవసరంలో ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనాల పరిమాణం చాలా తక్కువ. ఆన్‌లైన్, పరిమితులు, నిబంధనలతో సబ్సిడీ సీడ్ పంపిణీని తగ్గిస్తోంది. మరోవైపు ప్రభుత్వం సబ్సిడీ భరించాక కూడా రాయితీ విత్తనాల ధర బహిరంగ మార్కెట్‌తో సమానంగా ఉంటోంది. సేకరణలో అవినీతి అక్రమాల వలన నాసిరకం విత్తనం ఇస్తున్నారు. ధర నిర్ణయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో రైతులు సబ్సిడీ విత్తనాలపట్ల విముఖత వ్యక్తం చేస్తున్నారు. సేద్యం భారం కావడంతో రైతులు ... సబ్సిడీ విత్తనాల సేల్స్ తగ్గుతున్నాయి.

సబ్సిడీ విత్తనం తగ్గుదల

సంవత్సరం	పంపిణీ క్వింటాళ్లు	లబ్ధిదారులు	అమౌంట్ రూ.కోట్లు
2020 ఖరీఫ్	6,99,177	13,96,311	179.49
2020-21 రబీ	1,42,097	2,19,123	36.53
2021 ఖరీఫ్	6,17,480	11,80,905	172.20
2021-22 రబీ	3,91,680	4,56,348	93.11
2022 ఖరీఫ్	5,35,482	10,15,367	158.36
2022-23 రబీ	1,50,169	1,77,081	31.35

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కొండపి (ప్రకాశం జిల్లా)

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, ఈ చట్టం రక్షణకు ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రకాశం జిల్లా కొండపిలో గురువారం ఆయన మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన, వలసల నివారణ, గ్రామీణ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం వంటి ఉన్నతమైన లక్ష్యాలతో ఉపాధి హామీ చట్టం వచ్చిందని తెలిపారు. ఈ చట్టం గ్రామీణ పేదలకు ఆసరాగా ఉందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు కూడా విస్తరించాలని తెలిపారు.

ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే, మోడీ ప్రభుత్వం గత మూడేళ్లుగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు తగ్గిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో కూలీలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతోందని, రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం సామాన్యులపై భారాలను మోపి అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు దేశ సంపదను కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

దళిత యువకుడి హత్య

- పెత్తందార్ల దాడిలో మరో తొమ్మిదిమందికి గాయాలు
- కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవరంలో ఘటన

ప్రజాశక్తి - కోటనందూరు (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా తొండంగి మండలం శంగవక్షంలో మంగళవారం రాత్రి దళిత యువకుడిని పెత్తందారులు హత్య చేశారు. వారి దాడిలో మరో తొమ్మిది మంది గాయాల పాలయ్యారు. ఈ ఘటనతో పోలీసులు అప్రమత్తమై, గ్రామంలో పికెట్ నిర్వహించారు.

బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది మంగళవారం రాత్రి నూకాలమ్మ జాతర నిర్వహించారు. ఈ జాతరలో అన్ని సామాజిక తరగతుల వారు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. జాతరలో సిద్ధాంతపు రవి అనే దళిత యువకుని కాలు పెత్తందారుకు తగిలింది. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న దళితులు నడింపల్లి రాము, నక్కా నాగేశ్వరరావు, పులుగు భాను, గంగబాబు, అప్పలకొండ తదితరులు కల్పించుకోవడంతో తోపులాట జరిగింది. స్థానికులు కల్పించుకుని వారిని విడదీశారు. అక్కడ నుంచి గ్రామంలో ఒక చెట్టువద్దకు దళితులు వెళ్లారు. ఈ సమయంలో కొంతమంది పెత్తందారులు రాళ్లు, కర్రలతో వారిపై దాడికి తెగబడ్డారు. ప్రాణ భయంతో దళితులు పరుగులు తీశారు. ఈ దాడిలో పలువురు గాయపడ్డారు. రాళ్లదాడి నేపథ్యంలో జాతర చూసేందుకు తొండంగి గ్రామానికి చెందిన నడింపల్లి రాము తన బైకును వదిలి పారిపోయాడు. కొంత సమయం తరువాత తన బైకును తీసుకునేందుకు మళ్లీ వచ్చాడు. రాము బైకు తీసుకుని వెళ్తుండగా అక్కడే ఉన్న పెత్తందారులు అతనిపై రాళ్లు, కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేసి పరారయ్యారు.

రాము (ఫైల్)

ఈ దాడిలో రాము తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానిక దళితులు అతన్ని తొండంగిలో ప్రజా వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా అనంతరం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాము(21) మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు తుని ఏరియా ఆసుపత్రికి చేరుకుని నిరసన తెలిపారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో జిల్లా అడిషనల్ ఎస్‌పి రంగ ప్రవేశం చేసి దళితులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు.

మృతదేహంతో ఊరేగింపు

పెత్తంతారుల దాడిలో మరణించిన రాము మృతదేహంతో ప్రజా, దళిత సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. నిందితులను శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, దళితులపై దాడులను అరికట్టాలని నినదించారు. బుధవారం రాత్రి మృతుడి స్వగ్రామం తొండంగిలోని దళిత శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

మంత్రి రాజా ఆర్థిక సాయం

తుని ఏరియా ఆసుపత్రిలో రాము మృతదేహాన్ని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పరిశీలించారు. మృతుని కుటుంబానికి తన సొంత నిధులు రూ. రెండు లక్షలు, గాయపడిన తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

గ్రామంలో పోలీస్ పికెట్

దళిత యువకుని హత్య నేపథ్యంలో శృంగవృక్షం గ్రామంలో మంగళవారం రాత్రి నుంచి పోలీస్ పికెట్ నిర్వహించారు.

గ్రామంలో కొత్తవారిని ఎవర్నీ అనుమతించడం లేదు. గుంపులుగా తిరగరాదని ఆంక్షలు విధించారు. అర్ధరాత్రులు యువకులను తిరగకుండా అడ్డుకుంటున్నారు. అనుమానం వచ్చిన వారిని ఆపి వివరాలు తీసుకున్న తరువాతనే పంపిస్తున్నారు. తుని, తుని రూరల్, కోటనందూరు, తొండండి ఎస్‌ఐలు, పెద్దాపురం డిఎస్‌పి ఆధ్వర్యంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

పురాతన భవనం కూలి ముగ్గురు మృతి

- విశాఖలో విషాదం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అంజలి, దుర్గాప్రసాద్ (ఫైల్)

విశాఖ కలెక్టరేట్ సమీపంలోని రామజోగిపేటలోపురాతన మూడు అంతస్తుల భవనం కూలి ముగ్గురు మరణించారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం... రామజోగిపేటలో బుధవారం అర్ధరాత్రి మూడు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. సుమారు 40 ఏళ్ల క్రితం పిల్లర్లు లేకుండా, పునాది తక్కువ వేసి దీనిని నిర్మించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ భవనం నానిపోవడంతో కూలిపోయింది. ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో విజయవాడకు చెందిన కొమ్మిశెట్టి శివశంకర్, బీహార్‌కు చెందిన రమల్లా సాహు (చోటూ) నివసిస్తున్నారు. వీరు సమీపంలోని నూడిల్స్ దుకాణంలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ ఇటీవలే ఈ ఇంటిలో అద్దెకు దిగారు. మొదటి అంతస్తులో సాకేటి రామారావు, అతని భార్య కల్యాణి, కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె అంజలి నివసిస్తున్నారు. రామారావు ప్రైవేట్ ఉద్యోగి కాగా, అతని భార్య కళ్యాణి సమీపంలోని ఆయుష్మాన్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా పని చేస్తోంది. కుమారుడు దుర్గాప్రసాద్ సమీపంలోని ఆచారి కాలేజీలో ఇంటర్, కుమార్తె అంజలి రామకృష్ణ మిషనరీ స్కూలులో పదో తరగతి చదువుతున్నారు. మరో అంతస్తులో సన్నపు కృష్ణ, అతని భార్య రోజా రాణి నివసిస్తున్నారు. వీరి స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మరి గ్రామం. భవనం కుప్పకూలిన సంఘటనలో గ్రౌండ్ ఫ్లోర్‌లో నివసిస్తున్న రమల్లా సాహూ (చోటూ), మొదటి అంతస్తులో నివసిస్తున్న దుర్గాప్రసాద్ (17), అతని సోదరి అంజలి (15) అక్కడికక్కడే మరణించారు. మిగిలిన వారిని రక్షణ బృందాలు సమీపంలోని కెజిహెచ్‌కు తరలించాయి. సాకేటి కల్యాణి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలియగానే పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమయ్యాయి. సంఘటనా స్థలాన్ని జివిఎంసి మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కమిషనర్ రాజాబాబు, సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సందర్శించారు. మృతులకు రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం అందించాలని సిపిఎం డిమాండ్ చేసింది.

భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మిడియం బాబూరావు తదితరులు

1/70 చట్టంపై సవాలును ప్రభుత్వం ప్రతిఘటించాలి

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి - విశాఖపట్నం

1/70 చట్టంపై గిరిజనేతరుల సవాలును ఎపి ప్రభుత్వం ప్రతిఘటించాలని మాజీ ఎంపి, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ డాక్టర్ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. విశాఖపట్నం జిల్లా జగదాంబలోని సిఐటియు కార్యాలయంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం జరిగింది. తొలుత భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ 5వ షెడ్యూల్డ్ ఏరియాలో 1/70 చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కొంత మంది గిరిజనేతరులు కేసు వేసినట్టు తెలిపారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత, అమలు తీరును పర్యవేక్షించాల్సిన బాధ్యత గవర్నర్‌పైనా, రాష్ట్ర ప్రభుత్వంపైనా ఉన్నాయన్నారు. 1/70 చట్టం అమలుపై వచ్చిన సవాలును ప్రతిఘటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ఆ పని చేయని పక్షంలో గిరిజన సంఘంగా సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేయాలని సంఘం రాష్ట్ర కమిటీ తీర్మానించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, అధ్యక్షులు లోతా రామారావు, నాయకులు పి.అప్పలనర్స, ఎం.సీతారాం, కె.చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బమీద దెబ్బ

- నిన్న పట్టభద్రులు
- నేడు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసిపి నాయకత్వాన్ని షాక్‌కు గురి చేయగా టిడిపిలో ఉత్సాహాన్ని నింపాయి. రాష్ట్రంలో 108 నియోజకవర్గాల పరిధిలో తొమ్మిది జిల్లాలో మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో టిడిపి అనూహ్య విజయం సాధించింది. పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలను టిడిపి విజయాన్ని వైసిపి తక్కువ అంచనా వేసింది. పట్టభద్రుల ఎన్నికల్లో తమ పథకాల పొందని వారు తమకు వ్యతిరేకంగా ఓటు వేశారని వైసిపి నాయకత్వం ప్రకటించింది. పట్టభద్రులలో పేద వర్గాలకు చెందిన వారు కూడా ఉంటారన్న అంశాన్ని వైసిపి నాయకత్వం గ్రహించడం లేదు. మూడు నియోజకవర్గాల్లో టిడిపి విజయంపై సమీక్షించేలోగానే వైసిపికి మరో షాక్ తగిలింది. ఎమ్మెల్యేల కోటా ఏడు ఎమ్మెల్సీస్థానాలకు జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనూరాధ 23 ఓట్లు దక్కించుకుని విజయం సాధించారు. అనూరాధ విజయంలో టిడిపిలో మరింత ఉత్సాహం పెరిగింది. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లోనే కాకుండా అధికారపార్టీ శాసనసభ్యుల్లోనూ వ్యతిరేకత ఉందని తేటతెల్లం అయినట్టు టిడిపి నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవంగా పంచుమర్తి అనూరాధకు 19 ఓట్లు మాత్రమే ఉన్నాయని, తమకు ఏడుగురు అభ్యర్థులకు కావాల్సిన 154 ఓట్లు ఉన్నాయని వైసిపి ధీమా వ్యక్తం చేస్తూ వచ్చింది. 154 మందిని ఒక్కో అభ్యర్థికి 22 మంది చొప్పున ఎంపిక చేస్తూ గత వారం రోజులుగా వారికి ఓటు ఎలా వేయాలో శిక్షణ కూడా ఇచ్చారు. అయితే 154 మంది ఓట్లు చెల్లుబాటుకాగా వైసిపికి దక్కాల్సిన రెండు ఓట్లు టిడిపికి వచ్చాయి. మొదటి ప్రాధాన్యతలో టిడిపి అభ్యర్థి అనూరాధ 23 ఓట్లు సాధించడంతో షాక్‌కు గురికావడం వైసిపి నేతల వంతు అయింది. ప్రధానంగా నెల్లూరు జిల్లాకు చెందిన కోటంరెడ్డి, ఆనం, తాజాగా మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కూడా వైసిపికి వ్యతిరేకంగా ఓటు వేశారని మీడియాలో ప్రచారం జరుగుతోంది. మొత్తంగా నెల్లూరు జిల్లాలో వైసిపికి భారీగా గండిపడింది. ఏకంగా ఒకే సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు రెబల్స్‌గా మారడం సిఎం జగన్ మోహన్ రెడ్డికి మింగుపడని అంశంగా ఉంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సిట్టింగ్ ఎమ్మెల్యే ఉండగానే అదనపు సమన్వయకర్తల నియామకం ప్రయోగం తాడికొండలో విఫలం అయింది. శ్రీదేవి లాగానే ఇంకా చాలా మంది ఎమ్మెల్యేల మీద వ్యతిరేకత వ్యక్తం అవుతున్నా ఎక్కడా లేనివిధంగా తొలుత ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను అదనపు సమన్వయకర్తగా నియమించారు. తరువాత ఆయన్ను మార్చి కత్తెర సురేష్‌కుమార్‌ను నియమించారు. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని శ్రీదేవి గతకొంత కాలంగా వైసిపి నాయకత్వానికి దూరం అవుతున్నారనే ప్రచారం జరిగింది. మొత్తం ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించామని గొప్పగా ప్రచారం చేసుకున్న వైసిపికి ఈ ఫలితాలు మింగుపడని పరిస్థితిని కల్పించాయి.

NOTICE

Ref. No. 1/Election/APFA dated 21.03.23 for conducting elections to the Andhra Pradesh Football Association

The High Court of Andhra Pradesh, Amravati in its order dated 14.02.23 in WP No. 13152 of 2022 appointed Dr. Justice G. Yethirajulu (Retired) as the supervising authority to conduct elections to the Officer Bearers and Executive Committee of the Association. A voters list available with AP Olympic Association was obtained.

The President, APFA, the District Football Associations and persons interested to participate in the elections are requested to send their representations with supporting documents to prepare the final list of eligible voters for the election. The representations shall reach the undersigned on or before 31.03.2023 to its email address apfaelections2023@gmail.com and also through speed post to the following address:

Dr. Justice G. Yethirajulu, 501, Prithvi My Home Navadweepa, Madhapur Hyderabad 500081

If no representations are received by the above date, the voters list available with this authority will be treated as final. The decision of the undersigned regarding the list of eligible voters is final and binding on all concerned and it shall form the electoral college for voting in the elections.

Sd/- **Dr. Justice G. Yethirajulu (Retired)**
(Supervising Authority for elections of APFA)

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి, ఫస్ట్ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.
ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన, రుణదాతకు మార్టిగేజి చేసిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారిచే ది.04.01.2023, తేదీన నిర్మాణాత్మక స్వాధీనం చేసుకోబడిందని, సదరు ఆస్తులను రుణదాతచే "ఎక్కడ ఉన్నది అక్కడే" "ఉన్నది ఉన్నట్లే" మరియు "యదాతథం" ప్రాతిపదికపై తేది.17.05.2023 అమ్మకానికి తెలిపిన తేదీన విక్రయించబడునని ఋణగ్రహీతలు / హామీదారులు / సహహామీదారులు: (1) M/s. శ్యామ్ కాటన్ ట్రేడింగ్ కార్పొరేషన్, డి.నెం.6-35, బిసి కాలనీ, కాకుమాను, గుంటూరు-522112, (2) శ్రీ శ్యామ్ ప్రసాద్ పెదపూడి, తండ్రి: శ్రీ పెదపూడి అక్కయ్య, యజమాని: మెస్సర్స్ శ్యామ్ కాటన్ ట్రేడింగ్ కార్పొరేషన్, (3) శ్రీమతి నవజ్యోతి పెదపూడి, భర్త: శ్రీ శ్యామ్ ప్రసాద్ పెదపూడి. నెం.2) & 3) యొక్క చిరునామా: డి.నెం. 6-149, కాకుమాను, గుంటూరు-522112 మరియు (4) శ్రీ శ్యామ్ రాజు నీలం, తండ్రి: శ్రీ బెంజమిన్, చిరునామా: నెం.26-20-25, టీచర్స్ ఎన్‌క్లేవ్, ఎ బ్లాక్, శాంతినగర్, 4వ లైను, నగరంపాలెం, గుంటూరు-522004 నుంచి రుణదాత కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచి [PH: 99852 02444] i) i) PSOD/A/c No. 2557000600474601 క్రింద రూ.1,16,00,696.20/- (అక్షరాల ఒక కోటి పదహారు లక్షల ఆరు వందల తొంభై ఆరు రూపాయలు మరియు ఇరవై పైసలు మాత్రమే) + 01.03.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ ii) PSTL/A/c No.2557001801150801 క్రింద రూ.20,03,225.76/- (అక్షరాల ఇరవై లక్షల మూడు వేల రెండు వందల ఇరవై ఐదు రూపాయలు మరియు డెబ్బై ఆరు పైసలు మాత్రమే) + 01.03.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వెరశి మొత్తం: రూ.1,36,03,921.96/- (అక్షరాల ఒక కోటి ముప్పై ఆరు లక్షల మూడు వేల తొమ్మిది వందల ఇరవై ఒకటి రూపాయలు మరియు తొంభై ఆరు పైసలు మాత్రమే) మొ॥ వాటితో సహా మొత్తాన్ని వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించబడుచున్నవనీ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తుడు(లు) మరియు గ్యారంటీదారుడు(లు)లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

స్థిరాస్తుల వివరములు

1) గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, జడ్‌పి స్కూల్ రోడ్డు, అంబేద్కర్ సెంటర్ దగ్గర, నంబూరు గ్రామము, సమీప డోర్ నెం.18-221, డి.నెం. 427/B1, 427/B1B నందు శ్రీ శ్యామ్ ప్రసాద్ పెదపూడి పేరునగల 629.20 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: లేటు భీమవరపు సీతారత్తమ్మ యొక్క స్థలము; దక్షిణం: తియ్యగూర అంజిరెడ్డి యొక్క స్థలము; పడమర: షేక్ మీరాస షేక్ బాజి యొక్క స్థలము మొ॥; ఉత్తరం: డి.నెం.428 లోని సర్కారు డొంక.

రిజర్వుధర: రూ.65,65,000/- (అక్షరాల అరవై ఐదు లక్షల అరవై ఐదు వేల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా: రూ.6,56,500/- (అక్షరాల ఆరు లక్షల యాభై ఆరు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే)

2) గుంటూరు జిల్లా, శాంతినగర్ ఎక్స్‌టెన్షన్, 4వ లైను, నగరంపాలెం, అగ్రహారం, డోర్ నెం. 26-20-65 నందు టీచర్స్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, మొదటి అంతస్తులో శ్రీ శ్యామ్ రాజు నీలం పేరునగల రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.FF1 మరియు మొత్తం 400 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగమైన 32 చ॥గ॥లతో సహా యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా; దక్షిణం: శూన్యాకాశము; పడమర: శూన్యాకాశము; ఉత్తరం: ఫ్లాట్ నెం. FF3. మొత్తం ఆస్తికి హద్దులు: తూర్పు: ఐ.సత్యనారాయణ యొక్క ఆస్తి; దక్షిణం: జె.నిల్సన్ & డాన్ భూషణం యొక్క ఆస్తి; పడమర: 30' వెడల్పుగల మునిసిపల్ రోడ్డు; ఉత్తరం: సుబ్బారావు యొక్క ఆస్తి.

రిజర్వుధర: రూ.22,00,000/- (అక్షరాల ఇరవై రెండు లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా: రూ.2,20,000/- (అక్షరాల రెండు లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే)

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు / తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ (8) సబ్ రూల్ (6) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది) అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కర్ణాటక బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ అనగా www.karnatakabank.com లో "mortgaged assets for sale" హెడ్ క్రింద సందర్శించండి.

ఇ-వేలము 17.05.2023 తేదీన ఉ॥ 11.00 గం॥ నుండి ఉ॥ గం॥ 11.20 ని॥ల వరకు https://bankauctions.in/ పోర్టల్ ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును.

ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును https://bankauctions.in/ నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు ఇ-వేలంపై శిక్షణను (తాత్కాలికంగా 16.05.2023న) ఆన్‌లైన్ ద్వారా M/s.4closure, 605ఎ, HMDA మైత్రీవనం, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ-500038, సంప్రదించవలసిన నెం: 040-23736405, mobile 8142000061/66, Email: subbarao@bankauctions.in and info@bankauctions.in నుండి పొందవచ్చును.

తేది: 21-01-2023, ప్రదేశం: హైదరాబాద్ సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.
రిజిష్టర్డు ఆఫీసు: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్డు, నవరంగపురం, అహ్మదాబాద్-09.
బ్రాంచి ఆఫీసు: 76-8-10/1, ఫ్లాట్ నం.4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, భవానిపురం, విజయవాడ-520012.

అమ్మకపు ప్రకటన

టు: 1. గంధం సిల్క్స్, 3వ అంతస్తు, షాపు నం.228 మరియు 229, వస్త్రలత-బిఆర్‌పి రోడ్డు, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001, ఆం.ప్ర. 2. గంధం పద్మజా, డోర్ నం.10-4-94ఎ, అర్జున వీధి, మల్లికార్జునపేట్, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001, ఆం.ప్ర., 3, రాఘవేంద్ర గంధం, డోర్ నం.10-4-94ఎ, అర్జున వీధి, మల్లికార్జునపేట్, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001, ఆం.ప్ర., 4. రాఘవేంద్ర గంధం, డోర్ నం.20-126/103, వెంకట్ నోవాస్ ఎలైట్, ఆంధ్రా హాస్పిటల్, గొల్లపూడి ఎదురుగా, విజయవాడ-521225, ఆం.ప్ర. 5. గంధం లక్ష్మి జయశ్రీ, డోర్ నం.20-126/103, వెంకట్ నోవాస్ ఎలైట్, ఆంధ్రా హాస్పిటల్, గొల్లపూడి ఎదురుగా, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001, ఆం.ప్ర. 6. గంధం సత్యనారాయణ, డోర్ నం.20-126/103, వెంకట్ నోవాస్ ఎలైట్, ఆంధ్రా హాస్పిటల్, గొల్లపూడి ఎదురుగా, విజయవాడ-521225, ఆం.ప్ర. 7. గంధం పద్మజా, డోర్ నం.20-126/103, వెంకట్ నోవాస్ ఎలైట్, ఆంధ్రా హాస్పిటల్, గొల్లపూడి ఎదురుగా, విజయవాడ-521225, ఆం.ప్ర.

డియర్ సర్/మ్యాడం,

విషయం: తాకట్టుపెట్టిన ఆస్తి అమ్మకం కొరకు ప్రకటన-105 ఐడి 82866826, 14722311

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (ఇందు తదుపరి "షార్ఫసీ యాక్ట్"గా పేర్కొనుట జరుగుతుంది) యొక్క సెక్షన్ 13(2) క్రింద మాచేత జారీచేయబడిన మా తేది: 08.02.2022 నాటి డిమాండ్ నోటీసు ను మేము రెఫర్‌చేస్తూ, ఏదైతే, సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులు (అరవై రోజులు)లోగా చెల్లించునాటికి తదుపరి వడ్డీతోసహా పూర్తి మొత్తాలు రుణ ఖాతా నం.8286826, 14722311 లోకి సంబంధించి 16.03.2023 నాటికి బకాయిగా రూ.94,78,294/- (రూపాయలు తొంభై నాలుగు లక్షల డెబ్బై ఎనిమిది వేల రెండు వందల తొంభై నాలుగు మాత్రమే)ల బకాయిని తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది మరియు మీచేత హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా పొందిన ఆర్థిక సదుపాయలును రుణ ఖాతా నంబరు 3054289కి సంబంధించి మీరందరిచేత చెల్లించవలసిగా కోరబడినది. ఆ విధంగా డిమాండ్‌చేసినట్లుగా చెల్లించుటలో మీరు అశ్రద్ధవహించారు.

అట్టి బకాయి మొత్తాలను చెల్లించుటలో విఫలం చెందినందున, సదరు చట్టం యొక్క సెక్షన్ 14 క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ అనుబంధం "ఎ" (మరియు ఇందు తదుపరి "సెక్యూర్డ్ అసెట్స్"గా పేర్కొనబడుతుంది) లో ఇందు దిగువ వివరించిన ఆస్తుల యొక్క గౌరవ చీఫ్ జ్యుడిషల్ మజిస్ట్రేట్ విజయవాడ వారిచే జారీచేయబడినట్లుగా అడ్వకేట్ కమిషనర్ ద్వారా హెచ్‌డిబిఎఫ్‌ఎస్ యొక్క అధీకృత అధికారిచేత భౌతిక స్వాధీనం చేసుకోబడినది.

ఇందుమూలంగా మీకు తెలియజేయబడునది ఏమనగా, వడ్డీ& ఇతర చార్జీలతోపాటు పూర్తి బకాయి మొత్తాలను స్వీకరించుటకే, "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన ఈ నోటీసు తేదీ నుండి 15 రోజుల కాలవ్యవధి తరువాత, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1)తో రూల్ 8(5) యొక్క నియమాల క్రింద సిఫారసుచేసినట్లుగా బహిరంగ వేలం మరియు/లేదా ఇతర పద్ధతుల ద్వారా ఇందు అనుబంధం "ఎ"లో పేర్కొన్నట్లుగా సెక్యూర్డ్ అసెట్‌ను విక్రయించుటకు క్రింది సంతకందారు ప్రతిపాదిస్తున్నారు.

(ఎ) రుణ ఖాతా నం. (బి) రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు/ హామీదారుల పేరు & చిరునామా / ఖాతా నం.	(సి) బకాయి మొత్తాలు	(డి) తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ (ఇ) తాకట్టుపెట్టిన ఆస్తి యొక్క రిజర్వు ధర (ఎఫ్) ధరావత్తు మొత్తాలు (జి) ధరావత్తు దాఖలుచేయుటకు చివరి తేది (హెచ్) వేలం తేది & సమయం
(ఎ) రుణ ఖాతా నం. 8286826, 14722311 (బి) 1. గంధం సిల్క్స్, 3వ అంతస్తు, షాపు నం.228 మరియు 229, వస్త్రలత-బిఆర్‌పి రోడ్డు, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001, ఆం.ప్ర. 2. గంధం పద్మజా, డోర్ నం.10-4-94ఎ, అర్జున వీధి, మల్లికార్జునపేట్, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001, ఆం.ప్ర., 3, రాఘవేంద్ర గంధం, డోర్ నం.10-4-94ఎ, అర్జున వీధి, మల్లికార్జునపేట్, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001, ఆం.ప్ర., 4. రాఘవేంద్ర గంధం, డోర్ నం.20-126/103, వెంకట్ నోవాస్ ఎలైట్, ఆంధ్రా హాస్పిటల్, గొల్లపూడి ఎదురుగా, విజయవాడ-521225, ఆం.ప్ర. 5. గంధం లక్ష్మి జయశ్రీ, డోర్ నం.20-126/103, వెంకట్ నోవాస్ ఎలైట్, ఆంధ్రా హాస్పిటల్, గొల్లపూడి ఎదురుగా, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001, ఆం.ప్ర. 6. గంధం సత్యనారాయణ, డోర్ నం.20-126/103, వెంకట్ నోవాస్ ఎలైట్, ఆంధ్రా హాస్పిటల్, గొల్లపూడి ఎదురుగా, విజయవాడ-521225, ఆం.ప్ర. 7. గంధం పద్మజా, డోర్ నం.20-126/103, వెంకట్ నోవాస్ ఎలైట్, ఆంధ్రా హాస్పిటల్, గొల్లపూడి ఎదురుగా, విజయవాడ-521225, ఆం.ప్ర.	(సి) సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులు (అరవై రోజులు)లోగా (ఇందు తదుపరి "బాకాయి మొత్తాలు"గా పేర్కొనుట జరుగుతుంది) రుణ ఖాతా నం.8286826, 14722311 కు సంబంధించి 16.03.2023 నాటికి రూ.94,78,294/- (రూపాయలు తొంబై నాలుగు లక్షల డెబ్బై ఎనిమిది వేల రెండు వందల తొంబై నాలుగు మాత్రమే).	(డి) కృష్ణా జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ ఏరియా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, విద్యాధరపురం, వేంకటేశ్వర స్వామి టెంపుల్, ముష్ప వారి స్ట్రీట్, డోర్ నం.1-3-27/10 తో ఆర్.ఎస్.26/1లో 140-24 చ.గ.ల విస్తీర్ణంలో నిర్మించబడిన రెసిడెన్షియల్ హౌస్ ఆస్తి. సరిహద్దులు: ఉత్తరం: దర్భ ఆది శేషు, దక్షిణం: మున్సిపల్ రోడ్డు, తూర్పు: చెల్లగుల్ల బాబు రావు ఆస్తి, పడమర: చిలకపాటి నాగేంద్ర ప్రసాద్ ఆస్తి. (ఇ) రూ.1,01,42,600/- (రూపాయలు ఒక కోటి ఒక లక్ష నలభై రెండు వేల ఆరు వందలు మాత్రమే) (ఎఫ్) రూ.10,14,260/- (రూపాయలు పది లక్షల పద్నాలుగు వేల రెండు వందల అరవై మాత్రమే) (జి) 10.04.2023 (హెచ్) 11.04.2023 సా॥ 5గం.ల వరకు

తేది: 24.03.2023
ప్రదేశం:విజయవాడ
సం/- అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

సంపాదకీయం

ఆదుకోండి!

గడచిన వారం రోజుల్లో కురిసిన అకాల వర్షాలు, వీచిన గాలుల మూలంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆరు లక్షల ఎకరాలకుపైగా వివిధ పంటలకు నష్టం వాటిల్లడంతో కోట్లాది రూపాయలు కోల్పోయిన రైతుల పరిస్థితి హృదయవిదారకంగా వుంది. రబీ పంటలన్నీ ఏదోఒక రీతిలో దెబ్బతిన్నాయి. అరటి, మొక్కజొన్న, టమోటా, బత్తాయి, దానిమ్మ, బొప్పాయి, కరివేపాకు పంటలకు అసాధారణ నష్టం సంభవించింది. చేతికి వచ్చిన అరటి, బత్తాయి, బొప్పాయి, కర్బూజా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కల్లాల్లో ధాన్యం, మిర్చి తడిచిపోయాయి. మామిడి, జీడిమామిడి పూత పిందె రాలిపోయాయి. పూల తోటలు కకావికలమయ్యాయి. సర్వస్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతను ఆదుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించడం అవసరం. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపడతామని భరోసా కల్పించడం పాలకుల బాధ్యత. రైతులకు ఆత్మ విశ్వాసం కల్పించేందుకు ఎన్యూమరేషన్, ఇతర పాలనాపరమైన చర్యల కోసం వేచి చూడడం కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం కొంత మొత్తాన్ని ఎక్స్‌గ్రేషియోగా చెల్లించాలి.

వారం పది రోజుల్లో కోత కోయాల్సిన దశలో అరటి తోటలు భీకరమైన గాలులు, వడగండ్ల వానతో నేలకొరిగాయి. వడగండ్ల వాన తీవ్రతకు చీని చెట్లు చీలిపోవడం, వాటి చిగుళ్లు పూర్తిగా రాలిపోయాయి. బొప్పాయి, దానిమ్మ ఒకటేమిటి అన్ని ఉద్యానవన పంటలూ దెబ్బతిన్నాయి. అరటి పంట సాగుకు ఎకరాకు రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు. కేవలం అనంతపురం జిల్లాలోనే ఉద్యానవన పంటల రైతులు 500 నుండి 600 కోట్ల రూపాయల మేర నష్టపోయారని ఓ అంచనా. రాష్ట్రంలో నష్టపోయిన మిగిలిన పంటల పరిస్థితీ అలాగే ఉంది. కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పర్యటించి పంట నష్టాలు నమోదు చేస్తున్నారు. అయితే, వారు ఈ-క్రాప్ బుకింగ్ ఆధారంగా పంట నష్టం నమోదు చేయడంవల్ల వాస్తవ పరిస్థితి ప్రతిబింబించడం లేదు సరికదా నిజంగా నష్టపోయిన వారికి సర్కారు సహాయం అందకపోయే ప్రమాదమూ ఉంది. కౌలుదార్ల పేర్లు కాకుండా భూ యజమాని పేరు నమోదైంది. కొన్ని చోట్ల అసలు ఏమీ లేని పరిస్థితి. కౌలుదార్లు పెట్టుబడి పెద్ద ఎత్తున నష్టపోయారు. ఈ నేపథ్యంలో జరిగిన పంట నష్టం ఆధారంగా సాగుదార్ల పేర్లు నమోదు చేసి (ఈ-క్రాప్ బుకింగ్‌లో వారి పేరు నమోదు కాకపోయినప్పటికీ) నష్టపోయిన వారికే పరిహారం చెల్లించాలి.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తక్షణం స్పందించడం, మానవతా దృక్పథంతో సహాయం అందించడం పాలకుల కర్తవ్యం. కానీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నవారు తమకు అనుకూలురా లేక ప్రత్యర్థులా అన్న దృష్టితో చూసి రాజకీయంగానే స్పందించడం సహాయం ప్రకటించడం, దాన్ని మంజూరు చేయడమూ జరుగుతోంది. వివక్ష ఆనవాయితీలా మారింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలను తిరస్కరించిన మోడీ సర్కారు ఆనాటి హుదూద్ తుపాను సహాయంతో సహా కేంద్ర నిధులకు ఎప్పుడూ కోతలూ కొర్రీలే పెట్టింది. అలాంటిది ఈ సందర్భంలో వారు స్పందిస్తారని ఆశించడం కష్టమే! రాష్ట్ర ప్రభుత్వం కనీసం అందుకు ఒత్తిడి కూడా చేయడం లేదు. రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంట నష్టపరిహారంపై వెంటనే అంచనా మొదలుపెట్టి, వారం రోజుల్లో పంట నష్టం అంచనా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఆదివారంనాడు కలెక్టర్లను ఆదేశించారు. తెలంగాణ ముఖ్యమంత్రి గురువారంనాడు జిల్లాల్లో పర్యటించి రైతులను ఊరడిల్లజేయడం మంచి విషయం. అయితే ఆయన ప్రకటించిన పరిహారం సొమ్ము వెంటనే అందే ఏర్పాటు చేయాలి. అప్పుడే ఈ పర్యటన, ఊరడింపులకు సార్థకత. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా త్వరితగతిన బాధితులకు సహాయాన్ని అందజేయాలి. వారిని ఆదుకోవాలి. అలా చేయకుండా మాది రైతు ప్రభుత్వం అని మాటలు చెబితే చాలదు. పంట కోల్పోయిన రైతులు, కౌలుదార్లు తమకు న్యాయమైన పరిహారం కోసం ఉద్యమిస్తారు.

మహనీయుల మాట

నీ అభిప్రాయాలతో ఏకీభవించకపోవచ్చు... కానీ నీ అభిప్రాయం చెప్పే హక్కు కోసం నా ప్రాణమిస్తాను.
- వోల్టేర్,
ఫ్రెంచి తత్వవేత్త.

మత గ్రంథాల పఠనంతో గర్భస్థ శిశువు డి.ఎన్.ఎ మారుతుందా?

విశ్లేషణ



డా॥ కె.శివబాబు

'గర్భ సంస్కార్' పేరిట గర్భిణీలకు శిక్షణ ఇవ్వడం ద్వారా పుట్టబోయే పిల్లలకు దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం, సాంస్కృతిక విలువలు ఏర్పడతాయన్న ప్రచారం గత కొద్ది సంవత్సరాలుగా మన దేశంలో సాగుతోంది. అందుకోసం శిక్షణా శిబిరాలు కూడా వెలుస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఈ నెల 5వ తేదీన... ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ "సంవర్ధిని న్యాస్"... ఢిల్లీ లోని జెఎన్‌యు (జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటి)లో "గర్భ సంస్కార్" పేరిట ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్ లో కొందరు గైనకాలజిస్టులు, ఆయుర్వేద వైద్యులు కూడా పాల్గొన్నారు. దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం పెంపొందాలంటే మహిళలు తమ గర్భధారణ సమయంలోనే భగవద్గీత, రామాయణ శ్లోకాలు పఠించాలని 'సంవర్ధిని న్యాస్' జాతీయ కార్యదర్శి మాధురి మరాఠే ఉద్బోధించారు. ఈ పఠనం వలన తల్లి గర్భంలోని శిశువుకు భారతీయ సాంస్కృతిక విలువలు అలవడతాయని ఆమె వ్యాఖ్యానించారు. గర్భధారణ సమయంలో ఇలాంటి గీతాలాపన చేయడం వలన గర్భస్థ శిశువులోని డి.ఎన్.ఎ (జన్యువు)లో మార్పులు జరుగుతాయని కూడా కొందరు వక్తలు వ్యాఖ్యానించారు. మరికొందరు వక్తలు సంస్కృత శ్లోకాలు చదవడం వలన తల్లి గర్భాశయం, శిశువు మెదడు ప్రక్షాళన చేయబడతాయని కూడా వ్యాఖ్యానించారు. ప్రతి సంవత్సరం 1000 మంది గర్భిణీలకు గర్భ సంస్కార్ శిక్షణ గరపాలని అక్కడ హాజరైనవారు తీర్మానించారు.

దేశమంతటా గర్భిణీ స్త్రీలు అవలంబించాలంటూ ప్రవచించబడుతున్న ఈ "గర్భ సంస్కార్" సిద్ధాంతానికి వున్న శాస్త్రీయత ఏమిటనేది పరిశీలించాల్సి వుంది. కొన్ని అంశాల ప్రాతిపదికగా దీనికి సమాధానాలు వెతికే ప్రయత్నం చేయాలి.

గర్భస్థ శిశువుకు వినికిడి శక్తి ఎప్పుడు వస్తుంది?

వైద్య శాస్త్ర పరిజ్ఞానం ప్రకారం అండం, శుక్ర కణం ఫలదీకరణ చెందిన నాటి నుండి మొదటి ఎనిమిది వారాలు పూర్తయ్యేసరికి అన్ని ముఖ్య అవయవాలు ప్రాథమికంగా ఏర్పడతాయి. ఈ మొదటి ఎనిమిది వారాల కాలాన్ని "పిండం" (ఎంబ్రియో)గా పరిగణిస్తారు. తొమ్మిదో వారం నుండి శిశు జననం వరకూ ఉండే కాలాన్ని "శిశువు" (ఫెటస్)గా పరిగణిస్తారు. తల్లి గర్భంలో 22 నుండి 24 వారాల సమయంలో గర్భం బయట తల్లి శరీరంలో రక్తనాళాల్లోని రక్తప్రసరణ, శ్వాస ప్రక్రియ వంటి 'లో ఫ్రీక్వెన్సీ' శబ్దాలను శిశువు వినగల్గడం ప్రారంభమవుతుంది. 25 వారాల తర్వాత వినికిడి శక్తి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే ప్రక్రియ కొనసాగుతుంది.

మనిషి ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నప్పుడు డోపమిన్, ఎండార్ఫిన్స్ వంటి హార్మోన్లు విడుదలై ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అంతేకానీ ఆ పేరిట మతగ్రంథాలు పఠిస్తే, శ్లోకాలు వల్లిస్తే దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం, సాంస్కృతిక విలువలు ఏర్పడతాయనీ, డి.ఎన్.ఎ లో మార్పులు జరుగుతాయనీ సిద్ధాంతీకరించడం అశాస్త్రీయం, కుట్రపూరితం. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి అమరవీరులు తమ తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఏ గర్భసంస్కారాలు చేయించుకున్నారు?

ఎపిజెనెటిక్స్ అంటే ఏమిటి?

అండం ఫలదీకరణం చెందిన తొలి రోజుల నుండి పిండ దశ పూర్తయ్యే మొదటి 8 వారాల పాటు బాహ్య కారకాల ప్రభావం గర్భంలో ఎదుగుతున్న పిండంపైన ఉంటుంది. ఉదాహరణకు తల్లికి మధుమేహం వ్యాధి లేదా స్థూలకాయం లేదా మానసిక వ్యాధి ఉన్నప్పుడు, తల్లి తినే ఆహారంలో లేదా పరిసర వాతావరణంలో అననుకూల పరిస్థితులు లేదా ప్రమాదకరమైన ఔషధాలు లేదా రసాయనాల ప్రభావం పడ్డప్పుడు పిండంలోని డి.ఎన్.ఎ మిథిలేషన్ వంటి ప్రక్రియలలో మార్పులు జరిగే అవకాశం ఉంది. వీటిని ఎపిజెనెటిక్ మార్పులుగా వైద్య పరిభాషలో పేర్కొంటారు. తత్ఫలితంగా జీన్స్ వ్యక్తీకరణలో జరిగే మార్పుల ప్రభావం శిశువు జన్మించిన తర్వాత పెరిగి పెద్దయ్యాక కూడా ఉంటుందని వైద్య శాస్త్ర అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఎపిజెనోమ్ ఫలితంగా జీన్స్ వ్యక్తీకరణలో మాత్రమే మార్పులు జరుగుతాయి తప్పితే డి.ఎన్.ఎ నిర్మాణం (సీక్వెన్స్)లో కాదనే విషయం గుర్తించాలి.

శ్లోకాలు, మంత్రోచ్చారణ శబ్దాలు శిశువుకు వినపడి ఎపిజెనెటిక్ మార్పులు జరుగుతాయా?

ఫలదీకరణం పూర్తయిన తొలి రోజుల నుండి మొదటి 8 వారాల పిండ దశలోనే బాహ్య కారకాల వలన సంభవించే ఎపిజెనెటిక్ మార్పులు చోటుచేసుకుంటాయని ఇంతకుముందే తెలుసుకున్నాం. కాబట్టి ఈ దశ లోనే జెనెటిక్ ప్రోగ్రామింగ్ పూర్తవుతుంది. గర్భస్థ శిశువు శ్లోకాలు, మంత్రోచ్చారణ లాంటి బాహ్య శబ్దాలను వినగల్గడం 25 వారాల తర్వాత మొదలవుతుందని తెలుసుకున్నాం.

వాదన కోసం...శ్లోకాలు లేదా మంత్రోచ్చారణ వంటి బాహ్య శబ్దాల వలన ఎపిజెనెటిక్ మార్పులు జరిగే అవకాశం ఉన్నదని అనుకుందాం. గర్భస్థ శిశువు 25 వారాలు పూర్తయిన తర్వాత మాత్రమే శ్లోకాలు లేదా మంత్రోచ్చారణ లాంటి బాహ్య శబ్దాలను వినగల్గినప్పుడు, మొదటి 8 వారాలలోపు పూర్తయ్యే ఎపిజెనెటిక్ మార్పులు తర్వాత కాలంలో జరగడం సాధ్యం కాదు కదా! ఆ దశలో బాహ్య శబ్దాలకూ లేదా తల్లి పలుకులకూ, కదలికలకూ స్పందనగా గర్భస్థ శిశువు కదలికలు చోటుచేసుకోవడం మాత్రమే జరుగుతుంది.

మంత్రోచ్చారణలు, మత గ్రంథ పఠనాలతో దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం, సాంస్కృతిక విలువలు ఏర్పడతాయా? గర్భశుద్ధి జరుగుతుందా?

దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం, సాంస్కృతిక విలువలు అనే అంశాలు మన దేశంలోనే కాదు... ప్రపంచంలోని అన్ని దేశాల లోనూ అత్యంత ఆవశ్యకమైనవి. అలాగే ఈ సద్భావనలు దేశంలోని అన్ని మతాల, కులాల ప్రజలలో పెంపొందించబడాలి. ఆయా దేశాల్లో నెలకొన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, లింగ వైరుధ్యాలను బట్టి వ్యక్తుల ప్రతిస్పందనలు రూపొందుతాయి. అలాగే తల్లిదండ్రుల పెంపకం, ఉపాధ్యాయుల బోధనలో విలువలు, పరిసరాలు, సాహచర్యం ప్రభావం, ఆయా దేశాల్లో అమలయ్యే నియమ నిబంధనలు, సాంప్రదాయాలు, చట్టాలు వంటి అంశాలన్నీ వ్యక్తుల సంస్కారం, ప్రవర్తన రూపొందడంలో ముఖ్య పాత్ర వహిస్తాయి.

ఏ దేశంలో అయినా, ఏ మతానికి చెందిన వారైనా, వాళ్ల వ్యక్తిగత విశ్వాసాల వలన ఆయా మత గ్రంథాలను పఠించినప్పుడు, ఆయా పద్యాలు లేదా సూక్తులు ఉచ్చరించినప్పుడు వారి మనసు ప్రశాంతంగా ఉండటం, వారికి స్వాంతన కల్గడం సహజమే. ఇంపైన, మధురమైన సంగీతానికి మానసిక అలజడిని తగ్గించే స్వభావం ఉన్నదన్న విషయాన్ని ఎవరూ కాదనలేరు. అందుకే మనం వాడుక పరిభాషలో "సంగీతంలో ఓలలాడారు, పారవశ్యం చెందారు" అంటుంటాము. బాధలు మరచి పారవశ్యం చెందేలా చేయగల్గిన ఏ మతంలోని ఏ ప్రార్థనైనా, ఏ జానపద గీతమైనా, ఏ మెలొడియస్ రాగమైనా సగటు మనిషికి ఉపయోగమే. అందులోనూ విశ్వాసంతో కూడినప్పుడు ఖచ్చితంగా మేలు చేకూరుస్తుంది. మనిషి ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నప్పుడు డోపమిన్, ఎండార్ఫిన్స్ వంటి హార్మోన్లు విడుదలై ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అంతేకానీ ఆ పేరిట మతగ్రంథాలు పఠిస్తే, శ్లోకాలు వల్లిస్తే దేశభక్తి, స్త్రీల పట్ల గౌరవం, సాంస్కృతిక విలువలు ఏర్పడతాయనీ, డి.ఎన్.ఎ లో మార్పులు జరుగుతాయనీ సిద్ధాంతీకరించడం అశాస్త్రీయం, కుట్రపూరితం. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి అమరవీరులు తమ తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఏ గర్భ సంస్కారాలు చేయించుకున్నారు? స్త్రీల హక్కుల్ని కాపాడే బిల్లును ఆమోదించనందుకు నిరసనగా కేంద్ర న్యాయశాఖామంత్రి పదవికి రాజీనామా చేసిన మహనీయుడు బి.ఆర్.అంబేద్కర్ తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఏ మతగ్రంథాల పఠనం గావించారు?

గర్భధారణ సమయంలో ఏం చేయాలని వైద్యశాస్త్రం చెప్తోంది?

గర్భధారణ సమయంలో మానసికంగా ప్రశాంతంగా ఉండటం, అవసరమైన మేరకు తేలికపాటి వ్యాయామం చేయడం, చెవులకు ఇంపైన, మృదువైన సంగీతం వినడం, పాజిటివ్ ఆలోచనలు కల్గివుండటం, పజిల్స్ పూరించడం, ప్రకృతిలో గడపడం, మంచి విషయాలు మాట్లాడటం, సమతుల ఆహారం తీసుకోవడం, కాలుష్య రసాయనాలకు, కల్తీ ఔషధాలకు దూరంగా ఉండటం... వంటి అన్ని అంశాలు పాటించాలనీ, తద్వారా తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్యానికి కూడా సానుకూల ఫలితాలు కల్గుతాయనీ ఎప్పటి నుండో వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇవన్నీ శాస్త్రీయమైనవి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు ఏ మత గ్రంథాల పఠనంతోనూ, గర్భ సంస్కారాలతోనూ సంబంధం లేదు.

వ్యక్తి సంస్కారం, ప్రవర్తనలు రూపొందడంలో కీలకమైన అనేక అంశాల్ని కావాలని పక్కకు పెట్టి...రుజువు చేయలేని, శాస్త్ర విజ్ఞాన ప్రాతిపదిక లేని సంకుచిత భావోద్వేగాలతో మిళితమైన సిద్ధాంతాల్ని ప్రజలందరి పైనా రుద్దడానికి ప్రయత్నించడం వెనుక విభజన రాజకీయ ప్రయోజనాలు వున్నాయనేది సుస్పష్టం. సైన్సు పురోగతితో స్వేచ్ఛ, సమానత్వం, విశాల దృక్పథం కల్గిన ఆరోగ్యకరమైన సమాజం రావాలని ఆశించే ప్రజాహితులందరూ ఇలాంటి అశాస్త్రీయ తిరోగమన సిద్ధాంతాల్ని తిప్పికొట్టాల్సి వుంది.

/ వ్యాసకర్త జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు, సంగారెడ్డి జిల్లా /

> **గర్భధారణ సమయంలో మానసికంగా ప్రశాంతంగా ఉండటం, అవసరమైన మేరకు తేలికపాటి వ్యాయామం చేయడం, చెవులకు ఇంపైన, మృదువైన సంగీతం వినడం, ప్రకృతిలో గడపడం, మంచి విషయాలు మాట్లాడటం, సమతుల ఆహారం తీసుకోవడం, కాలుష్య రసాయనాలకు, కల్తీ ఔషధాలకు దూరంగా ఉండటం... వంటి అన్ని అంశాలు పాటించాలనీ, తద్వారా తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్యానికి కూడా సానుకూల ఫలితాలు కల్గుతాయనీ ఎప్పటి నుండో వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇవన్నీ శాస్త్రీయమైనవి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు ఏ మత గ్రంథాల పఠనంతోనూ, గర్భ సంస్కారాలతోనూ సంబంధం లేదు.**

హక్కుల పరిరక్షణకు 'అన్‌హద్'

కామన్ సెన్స్

డా॥ దేవరాజు మహారాజు

గుజరాత్‌లో 2002లో జరిగిన మారణహోమానికి ప్రతిస్పందనగా మార్చి 2003లో అన్‌హద్ (యాక్ట్ నౌ ఫర్ హార్మొనీ అండ్ డెమోక్రసీ) పేరుతో ఒక ఎన్‌జివో సంస్థ రూపుదిద్దుకుంది. ఆ సంస్థ ఇరవయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అన్‌హద్ కార్యక్రమాల్ని ఒకసారి నెమరు వేసుకోవాల్సి ఉంది. అలాంటి ఎన్‌జివోల అవసరం నేడు దేశంలో ఎంతగా ఉందో ఆలోచించుకోవాల్సి ఉంది. దేశంలో నాశనమవుతున్న మానవ హక్కులు, అపహాస్యం పాలవుతున్న ప్రజాస్వామ్యం, బద్దలవుతున్న సామాజిక న్యాయం, బీటలు బారుతున్న సుహృద్భావం-కొంతమంది సామాజిక కార్యకర్తల్ని, మార్క్సిస్టు మేధావుల్ని స్థిమితంగా కూర్చోనీయలేదు. వారు సత్వరమే 'అన్‌హద్'కు రూపకల్పన చేసి, కార్యరంగంలోకి దూకారు. సామాజిక కార్యకర్త షబ్నమ్ హష్మి, ఆమె సోదరుడు సఫ్దర్ హష్మి, మార్క్సిస్టు చరిత్రకారుడు ప్రొ॥ కె.ఎన్.ఫణిక్కర్, సామాజిక కార్యకర్త హర్ష్ మందర్ ప్రభృతులంతా కలిసి ఢిల్లీలో 'అన్‌హద్'ను ప్రారంభించారు. 'అన్‌హద్' అంటే హద్దులు లేనిది. కుల మతాల మధ్య, ప్రాంతాల మధ్య ద్వేషాన్ని నింపి, మనిషిని మనిషితో కలవకుండా చేస్తున్న వారి ఆటలు కట్టించడానికి అన్‌హద్ ఏర్పడింది.

కేవలం నిజాయితీ, నిబద్ధతల మీద నడుస్తున్న ఈ ఎన్‌జిఓకు ఏ ఆర్థిక వనరులూ లేవు. చెప్పుకోదగ్గ నెట్‌వర్కూ లేదు. అయినా, అది శక్తికి మించి దేశ పౌరులకు స్ఫూర్తినందిస్తూ ఉంది. నాటకకర్త సఫ్దర్ హష్మి, అన్‌హద్ కంటే ముందు 'సహమత్' సంస్థను రూపొందించారు. ఆ అనుభవం ఇక్కడ పనికొచ్చింది. సహమత్-అంటే అంగీకరించడం. భారత రాజ్యాంగం లోని ప్రాథమిక హక్కుల గురించి ప్రజలకు వివరించడం-'అన్‌హద్' ఉద్దేశం. ముఖ్యంగా గుజరాత్ లోను, కాశ్మీర్ లోనూ మతతత్వ వాదుల దాడుల్ని ఎదుర్కొనడం, వారిని ధైర్యంగా చట్టానికి అప్పగించడం ఈ సంస్థ సాధించిన విజయాలలో ముఖ్యమైనది. అన్‌హద్ ఆలోచనల్ని, ఆశయాల్ని జనంలోకి విరివిగా తీసుకుపోవడానికి పుస్తకాలు, కరపత్రాలు ప్రచురించడం జరిగింది. అన్‌హద్ సభ్యులు గ్రూపులుగా ఏర్పడి, జనంలో తిరుగుతూ ప్రజలకు మానవ హక్కుల గూర్చి, రాజ్యాంగం లోని కీలకాంశాల గూర్చి, మానవీయ విలువల గూర్చి విరివిగా ప్రచారం చేశారు. ఇంకా జరుగుతూనే ఉంది. అన్‌హద్‌లో భాగస్వాములు కావడం ఈ దేశ పౌరులందరి బాధ్యత!

'అన్‌హద్' ఎన్‌జివోను ఒక ట్రస్ట్‌గా రిజిస్టర్ చేశారు. దీని ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ లోని కన్నింగ్ లేన్‌లో ఉంది. మొదట ఆరుగురు (షబ్నమ్ హష్మి, అబన్ రాజా, అమృతా నాండి, హర్ష్ మందర్, శుభా మీనన్, ముఖ్తార్ షేక్) ట్రస్టీ సభ్యులుగా ఉన్నారు. ఆ తర్వాత కాలంలో ప్రొఫెసర్ కె.ఎన్.ఫణిక్కర్, ప్రొఫెసర్ రామ్ పున్యాని, శోభా ముద్గల్ (సంగీతకారిణి), కమలా భాసిన్ (స్త్రీ వాద కవయిత్రి), సయీద్ అఖ్తర్ మిర్జా (రచయిత-చిత్ర దర్శకుడు), ధృవ్ సంగం (గాయకుడు-సంగీతకారుడు) మొదలైన ప్రముఖులంతా గత పదహారేళ్ళుగా ఆ ట్రస్ట్‌లో ఉన్నారు.



> **కేవలం నిజాయితీ, నిబద్ధతల మీద నడుస్తున్న ఈ ఎన్‌జిఓకు ఏ ఆర్థిక వనరులూ లేవు. చెప్పుకోదగ్గ నెట్‌వర్కూ లేదు. అయినా, అది శక్తికి మించి దేశ పౌరులకు స్ఫూర్తినందిస్తూ ఉంది. నాటకకర్త సఫ్దర్ హష్మి, అన్‌హద్ కంటే ముందు 'సహమత్' సంస్థను రూపొందించారు. ఆ అనుభవం ఇక్కడ పనికొచ్చింది. సహమత్-అంటే అంగీకరించడం. భారత రాజ్యాంగం లోని ప్రాథమిక హక్కుల గురించి ప్రజలకు వివరించడం-'అన్‌హద్' ఉద్దేశం. ముఖ్యంగా గుజరాత్ లోను, కాశ్మీర్ లోనూ మతతత్వ వాదుల దాడుల్ని ఎదుర్కొనడం, వారిని ధైర్యంగా చట్టానికి అప్పగించడం ఈ సంస్థ సాధించిన విజయాలలో ముఖ్యమైనది.**

2002 గుజరాత్ మారణహోమానికి బలయి, నిరాశ్రయులైన బాలబాలికల్ని అన్‌హద్ సంరక్షించింది. గుజరాత్ అల్లర్లపై వచ్చిన 'పర్జానియా' వంటి చలన చిత్రాలు వారికి చూపించి, వాస్తవాలు అర్థమయ్యేట్టుగా చేసింది. 2010లో ఈ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్మీ-సెక్యూరిటీ బలగాలు కాశ్మీర్ లోయలో ఎన్నో దురాగతాలకు పాల్పడ్డాయని...ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కుల్ని అపహాస్యం చేశాయనీ-అపహాస్యమే కాదు కొన్ని చోట్ల అవి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయని అందుకు కారణం ఇప్పటి కేంద్ర ప్రభుత్వమేననీ-అన్‌హద్ నిర్భయంగా చెప్పగలిగింది. అలాగే బట్లా హౌస్ ఎన్‌కౌంటర్ కేసు గురించి దర్యాప్తు చేయాల్సిందిగా ఢిల్లీ పోలీసులను అన్‌హద్ డిమాండ్ చేసింది. 2009లో మహిళా రిజర్వేషన్ బిల్లు మీద ఈ ఎన్‌జిఓ సంస్థ దృష్టి సారించింది. ఆ విషయాన్ని దేశ వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయడానికి 'రిజర్వేషన్ ఎక్స్‌ప్రెస్' అనే కార్యక్రమం రూపొందించుకుంది. దేశంలో దుష్టపాలనకు మూల కారణమైన ఆర్‌ఎస్‌ఎస్‌ను వెంటనే నిషేధించాలని అన్‌హద్ 24 మార్చి 2012న డిమాండ్ చేసింది. దేశంలో ముస్లింల అస్తిత్వాన్ని విశ్లేషించడానికి జాతీయ సమావేశాలు నిర్వహించింది. ఉగ్రవాదం పేరుతో అన్యాయంగా మైనార్టీల మీద (2010-2012) జరుగుతున్న అఘాయిత్యాల్ని నిరసిస్తూ 2010 లోను 2012 లోనూ కార్యక్రమాలు చేపట్టింది. ధులే - అల్లర్ల మీద నిజ నిర్ధారణ కమిటీ వేసి, మానవ హక్కుల పరిరక్షణకు సామాజిక న్యాయ స్థాపనకు పోరాడింది. అన్‌హద్ చేపట్టిన కార్యక్రమాలలో ఇవి కొన్ని మాత్రమే- దేశంలో ప్రభుత్వ పరంగా ఎక్కడ ఏ అన్యాయం జరిగినా అన్‌హద్ ఎండగడుతూనే వచ్చింది. నిరంతరం తన పోరాటం కొనసాగిస్తూనే ఉంది. స్వర్గమంటే ఎక్కడో లేదు. దాన్ని ఈ ధరాతలం మీద మనమంతా కలిసి నిర్మించుకోవాల్సి ఉందన్న మాటను వాస్తవంలోకి తేవడానికి దేశ పౌరులంతా కంకణ బద్ధులు కావాలి.

దేశ పౌరుల్ని అంధ విశ్వాసాల్లో ముంచేయడానికి నేటి కేంద్ర ప్రభుత్వం అనేక రకాలుగా ప్రయత్నిస్తోంది. 'భారత్ గౌరవ్' పేరుతో ఉత్తర భారతదేశంలో ఒక రైలు నడుపుతోంది. అది అక్కడి పుణ్యక్షేత్రాలన్నింటినీ చుట్టుకుని వస్తుంది. అంటే... దేశ పౌరులు దైవ భావన లోంచి బయటపడి ఎక్కడ వైజ్ఞానికతను అందిపుచ్చుకుంటారోనన్నది ప్రభుత్వాధినేతల భయం. అలాంటిదే 'గర్భ సంస్కార్' ఒకటైతే, పాఠశాలల్లో భగవద్గీతను బోధించడం మరొకటి. పురాణానికి, రాజ్యాంగానికి తేడా తెలుసుకోలేని మందబుద్ధులు అంతకన్నా ఇంకేం చేయగలరూ?

"నరేంద్ర మోడీ, అమిత్ షా లతో కలిసి ఈ దేశ ప్రజలనందరినీ నేను ఘోరంగా మోసం చేశాను. బిజెపి చేసిన స్కామ్‌లలో నాది కూడా సమానమైన భాగస్వామ్యం ఉంది. ఈ అపరాధ భావంతో నేను చచ్చిపోదలుచుకోలేదు. అందుకే, నన్ను క్షమించమని భారతీయులందరినీ వేడుకుంటున్నాను" అని చనిపోవడానికి ముందు రామ్ జత్మలాని (14 సెప్టెంబర్ 1923-8 సెప్టెంబర్ 2019) ప్రకటించాడు. ఆ ప్రకటనను పత్రికలు అచ్చేశాయి. ఆయన మాట్లాడిన వీడియో కూడా దేశ ప్రజలకు అందింది. రామ్ జత్మలాని సుప్రీంకోర్టు లాయరు, బార్ కౌన్సిల్ ఛైర్మన్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు. అంతే కాదు, రాజకీయవేత్త, కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి. దీనివల్ల ఏం తెలుస్తోంది అంటే... నిజాలు దాగవు! అని. డిస్కవరి సైన్స్ వంటి టెలివిజన్ ఛానల్ కార్యక్రమాలు ఒక్క పది నిముషాలు శ్రద్ధగా గమనిస్తే చాలు, మనిషి ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్ళాడు? ఎంత సాధించాడు? అనేది అర్థమవుతుంది. కానీ, మన ప్రభుత్వాలు విచక్షణా జ్ఞానాన్ని కప్పిపెట్టే విధంగా-రైతులు ఆవు ఆధారిత వ్యవసాయం చేయాలని ప్రకటిస్తాయి. ఆవు మూత్రం, ఆవు పేడ ప్రదర్శిస్తూ ప్రజల్ని వెనక్కి అనాగరిక సమాజం లోకి నెట్టేస్తాయి. ప్రభుత్వాలు చేస్తున్న అనైతిక దోపిడీని ఎవరూ ప్రశ్నించగూడదని ప్రభుత్వ పెద్దలు కోరుకుంటున్నారు. కానీ, అది ఎల్లకాలం సాగుతుందా? రైతు చట్టాల్ని ప్రజలు ఎలా తిప్పికొట్టారో గత సంవత్సరం చూశాం కదా? అదే స్ఫూర్తిని తీసుకుని ప్రజలు ఇతర విషయాలలో కూడా వివేకవంతంగా ఎందుకు స్పందించరూ? వారికి కావల్సిందేదో వారు ఎందుకు సాధించుకోరూ? 'అన్‌హద్' లాంటి ఎన్‌జిఓలు ప్రజలకు అండగా ఉంటూనే ఉన్నాయి.

నిత్య జీవితంలోని ఒక విషయం పరిశీలిద్దాం! చిన్న పిల్లల కల్పితాలకు, ఊహలకు అంతే ఉండదు. వాళ్ళు పులి తొడుగులు వేసుకుని, పులిలాగా అరుస్తూ, ఇంట్లో వాళ్ళను, చుట్టూ ఉన్న సన్నిహితులను భయపెడుతుంటారు. ఆ మరునాడే స్పైడర్ మ్యాన్ ముసుగు వేసుకుని-అంతెత్తున గాలిలో ఎగిరి పోతున్నట్టు ఊహించుకుంటారు. ఈ పిల్ల చేష్టలను చూసి పెద్దవారెవరైనా, ఎప్పుడైనా భయపడతారా? లేదు. అలా ఎన్నడూ జరగదు!

ఇప్పుడు పెద్దవాళ్ళే రకరకాల ముసుగులు వేసుకుని వీధుల్లోకి వచ్చి అరుస్తూ-హిందుత్వ పేరుతో కేకలేస్తున్నారు. ఈ దేశ ప్రజలేమైనా భయపడుతున్నారా? లేదే? వారి పిల్ల చేష్టలను చూసి జాలిపడుతున్నారు. వారి పిచ్చి ఇంకా ముదిరితే దేశ వ్యాప్తంగా 'షహీన్ బాగ్'లు వెలుస్తాయి. 'అన్‌హద్' ఎన్‌జిఓలు పుట్టుకొస్తాయి. హద్దులు గీసేవారినే హద్దులో పెడతాయి!!

/ వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవ శాస్త్రవేత్త /

జనవాక్యం

ఉల్లి రైతును ఆదుకోవాలి

గత సంవత్సర కాలంగా ఉల్లి ధరలు అనూహ్యంగా పడిపోయి లాభాల మాట దేవుడెరుగు. కనీసం గిట్టుబాటు ధర లభించక మహారాష్ట్ర రైతులు దిక్కు తోచక వున్నారు. మన రాష్ట్రంలోని టమాటా రైతుల పరిస్థితి కూడా అంతే. కారణం ఒక్కోసారి డిమాండ్‌ను మించి అధిక దిగుబడులు, వాటిని ఎక్కువ కాలం నిల్వ చేయ లేకపోవడం, తగిన ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవటం వంటివి. కనుక కేంద్ర ప్రభుత్వం కూడా ఈ సమస్యపై చొరవ తీసుకొని రైతులు పండించిన పంటలో కొంత భాగాన్ని పొరుగున ఉన్న దేశాలకు ముఖ్యంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి దేశాలకు ఎగుమతి చేసే చర్యలు తీసుకోవాలి. ఆ దేశాల్లో ఉల్లి కొరత ఏర్పడి కిలో వంద, నూటయాభై రూపాయలకి పైగా ధరలు పెరిగాయట. తాజాగా భారత్ బంగ్లాదేశ్ ప్రభుత్వాలు 377 కోట్ల రూపాయల ఖర్చుతో పైప్‌లైన్ నిర్మిస్తే పెట్రో సంస్థలు తాము దిగుమతి చేసుకునే ముడి చమురుని డీజిల్ గా ప్రాసెస్ చేసి, ఇక్కడ డిమాండ్ వున్నా అధిక లాభాల కోసం కొంత భాగం బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేయటాన్ని కేంద్ర ప్రభుత్వం సమ్మతించింది. అదే విధంగా డిమాండ్‌ను మించి పండిన పంటలో కొంత భాగాన్ని కేంద్ర గిడ్డంగుల సంస్థ కొని, ఎగుమతి చేసే విధంగా ప్రోత్సహిస్తే మన రైతులు నష్టాల ఊబి నుండి బయటపడతారు.

- తిరుమలశెట్టి సాంబశివరావు,
నరసరావుపేట.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

విప్లవ వీరులకు సిపిఎం ఘన నివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధులు, యువ విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు సిపిఎం ఘన నివాళి అర్పించింది. ఈ మేరకు షహీద్ దివస్ సందర్భంగా గురువారం నాడు భగత్ సింగ్ రోడ్డులోని భగత్ సింగ్ విగ్రహానికి పూలతో పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, సుభాషిణీ అలీ, తపన్ సేన్, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్, మురళీధరన్, రాజేంద్ర శర్మ, కేంద్ర కమిటీ సభ్యులు ఎఆర్ సింధూ, ఎవిజేసి కోశాధికారి కృష్ణప్రసాద్ తదితరులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ను స్మరించుకున్నారు. సుభాషిణీ అలీ, తపన్‌సేన్ మాట్లాడుతూ.. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడిన యువ కిశోరాలను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఏపి భవన్ వెబ్‌సైట్ ప్రారంభం

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ భవన్ (ఏపి భవన్) వివరాలను తెలుసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను గురువారం ప్రారంభించింది. ఏపి భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అదిత్యనాథ్ దాస్, అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ హిమాంశు కౌశిక్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరుగుతున్న ఉగాది వేడుకల్లో భాగంగా www.andhrabhavan.ap.gov.in ను గురువారం నాడు ఆవిష్కరించారు. ఏపి భవన్‌లో గదుల బుకింగ్ ఈ వెబ్‌సైట్ ద్వారా చేసుకునే వీలుకల్పించారు. ఈ కార్యక్రమంలో వాణి మాధవ్ బృందం ప్రదర్శించిన ఒడిస్సీ, కథక్, కూచిపూడి సమ్మిళిత నృత్యావళి విశేషంగా ఆకట్టుకుంది.

ఉభయసభల్లో అదే ప్రతిష్టంభన

- కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళనలు
- నిరసనల మధ్య లోక్‌సభలో ఆర్థిక బిల్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను నిరసిస్తూ పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రతిపక్షాల ఆందోళనలు గురువారం కూడా కొనసాగాయి. దీంతో ఇరు సభల్లోనూ ప్రతిష్టంభన నెలకొంది. పార్లమెంటు ప్రారంభమవ్వగానే విప్లవవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు అధికార, ప్రతిపక్షాల సభ్యులు ఘన నివాళులర్పించారు. అనంతరం అధిక ధరలు, నిరుద్యోగం, అదానీ అక్రమాలు తదితర అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ఇదే సమయంలో ప్రతిపక్షాలకు చెందిన నాయకులపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి అక్రమ కేసులతో, వివాదాలతో వేధిస్తున్న తీరును ప్రతిపక్షాల సభ్యులు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ వినాశకర చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో విదేశాల్లో రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఎత్తిచూపుతూ అధికార బిజెపి ఎంపీలు రాద్ధాంతం చేశారు. లోక్‌సభలో అధికార, ప్రతిపక్షాల పరస్పర ఆందోళనలతో సభ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో కూడా అధికార, ప్రతిపక్షాల నినాదాల హోరెత్తాయి. దీంతో సభ సాయంత్రం ఆరు గంటలకు వాయిదా పడింది. సప్లిమెంటరీ బిజినెస్‌లో ఆర్థిక బిల్లును జాబితా చేశారు. అనంతరం ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక బిల్లును ప్రవేశపెట్టగా...నిరసనలు కొనసాగుతుండగానే మూజువాణి ఓటుతో ఆమోదించారు. వెంటనే సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

మరోవైపు రాజ్యసభలోనూ అధికార, ప్రతిపక్షాల సభ్యుల ఆందోళన కొనసాగింది. దీంతో సభ తొలుత మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో కూడా అదే పరిస్థితి కొనసాగడంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన

అదానీ వ్యవహారంపై జెపిసితో విచారణ జరిపించాలని ప్రతిపక్షాల ఆందోళన గురువారం కూడా కొనసాగింది. పార్లమెంట్ ఆవరణంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రతిపక్షాలు ధర్నా చేపట్టాయి. ప్లకార్డులు చేబూని మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విప్లవవీరులకు ఘన నివాళి

విప్లవవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 92వ వర్ధంతి సందర్భంగా పార్లమెంట్ ఘన నివాళులర్పించింది. గురువారం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రకటన చేశారు. అనంతరం అధికార, ప్రతిపక్ష సభ్యులంతా తమ స్థానాల్లో లేచి మౌనం పాటించి నివాళులర్పించారు. మరోవైపు రాజ్యసభలో కూడా చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ అమరవీరులను త్యాగాలను గుర్తు చేస్తూ ప్రకటన చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యులంతా నివాళుర్పించారు.

రాహుల్ గాంధీ దోషి

(మొదటిపేజీ తరువాయి)

మతం సత్యం, అహింసపై ఆధారపడి ఉంటుంది. సత్యం నా దైవం. అహింస దానిని సాధించే ఆయుధం' అని మహాత్మా గాంధీ వ్యాఖ్యలను ఆయన కోడించారు.

ఏమిటీ కేసు?

2019 సాధారణ ఎన్నికల సందర్భంగా రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై బిజెపి సూరత్ పశ్చిమ ఎమ్మెల్యే, గుజరాత్ మాజీ మంత్రి పూర్ణేశ్ మోడీ ఆయనపై పరువు నష్టం దావా వేశారు. 'దొంగలందరికీ మోడీ అనే సాధారణ ఇంటి పేరు ఎలా వచ్చింది' అని రాహుల్ వ్యాఖ్యానించారని సూరత్ కోర్టును ఆశ్రయించారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్ణాటకలోని కోలార్‌లో జరిగిన ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదుదారు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మొత్తం మోడీ వర్గాన్ని ఇది అవమానపర్చేలా ఉన్నదని పూర్ణేశ్ మోడీ చెప్పారు.

పై కోర్టులకు వెళ్తాం : అభిషేక్ సింఘ్వీ

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌కు సూరత్ కోర్టు శిక్ష విధించడంపై ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీలు చేస్తామని ఆ పార్టీ నేత అభిషేక్ సింఘ్వీ తెలిపారు. కోర్టు తీర్పుపై ఆయన స్పందిస్తూ 'ఇది దిగువ కోర్టు ఇచ్చిన తొలి తీర్పు. ఇందులో తప్పులున్నట్లు నమ్ముతున్నాం. దీనిపై రాహుల్‌కు కానీ, కాంగ్రెస్‌కు కానీ ఏ ప్రభావమూ ఉండదు. ఈ తీర్పుపై సెషన్స్ కోర్టు, ఆ తర్వాత అవసరమైతే ఆపై కోర్టులకు వెళ్తాం' అని అన్నారు.

ప్రజాస్వామ్యానికే ఆందోళన కలిగించే విషయం : హేమంత్ సోరెన్

రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్ల శిక్ష విధించడం ప్రజాస్వామ్యానికే ఆందోళన కలిగించే విషయమని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విమర్శించారు. బిజెపియేతర ప్రభుత్వాలు, నాయకులు బిజెపి కుట్రలకు బలిపశు వులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జార్ఖండ్ అసెంబ్లీలో రసాభాస

రాహుల్ గాంధీకి జైలు శిక్ష విధించిన అంశంతో జార్ఖండ్ అసెంబ్లీ దద్దరిల్లింది. గురువారం ఉదయం సభ ప్రారంభమైనప్పటి నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెల్‌లోకి దూసుకొచ్చి, బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

తుళ్ళూరు బ్రాంచ్

చిరునామా : డి.నెం.7-19, తులసి థియేటర్ ప్రక్కన, తుళ్ళూరు, గుంటూరు జిల్లా-522237.
ఫోన్ : 08645-244744, 89192 81145, ఈ-మెయిల్ : bom1952@mahabank.co.in

బంగారం వేలం అమ్మకం ప్రకటన

కింద పేర్కొన్న వ్యక్తి రుణ ఖాతాలోని రుణాన్ని చెల్లించడంలో విఫలమయ్యారని ఇందుమూలంగా తెలియజేయడం జరిగింది. రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా వారికి పంపిన నోటీసులు బట్వాడా చేయకుండా బ్యాంకుకు తిరిగి వచ్చాయి. అందువల్ల వారు మొత్తం ఋణము మరియు ఇతర ఛార్జీలను చెల్లించవలసిందిగా మరియు **30.03.2023 (తేదీ)** లేదా అంతకు ముందు తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను తిరిగి చేజిక్కించుకోవాలని అభ్యర్థించబడినది, అలా చేయని పక్షంలో పేర్కొన్న సెక్యూరిటీలను రుణగ్రహీత యొక్క సొంత ఖర్చులతో బ్యాంక్ బహిరంగ వేలంలో బ్యాంకుల ప్రాంగణం వద్ద **31.03.2023 న మధ్యాహ్నం 11.00 గంటలకు** లేదా బ్యాంక్ యొక్క సంపూర్ణ అభీష్టానుసారం తదుపరి నోటీసు లేకుండా ఏదైనా ఇతర అనుకూలమైన తేదీలో విక్రయిస్తుంది. బంగారు ఆభరణాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న పార్టీలు వేలంలో పాల్గొనవచ్చు.

వ.నెం.	లోన్ తేది	లోన్ ఖాతా నెంబరు	ఋణగ్రహీత పేరు & చిరునామా	వేలం యొక్క రిజర్వు ధర
1	24-05-2022	60415568170	శ్రీ హరి ప్రసాద్ బండి, డి.నెం.5-161, దొండపాడు, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా - 522237	22 కేరట్ గోల్డ్ గ్రాము కొరకు రూ.5200/-
2	02-06-2022	60416294219		

తేది : 21-03-2023 సం/- బ్రాంచ్ మేనేజర్, తుళ్ళూరు బ్రాంచ్

DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
Ground & 1st Floor, Door No. 31-31-21, Sri Sai Baba Street,
Narayana Bhavan, Dabagardens, Visakhapatnam-530020

Case No. O.A. 93 / 2022

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993

Union Bank of India (e-AB), Behind Hindu College, Guntur
VS
M/s. Sri Chandra Enterprises
TO,
Defendant 1 : Sri Chandra Enterprises, Prop : Mekala Yedukondalu, S/o. Chandra Rao, D.No. 19-9-176, Hanuman Nagar, Guntur - 522001

PAPER PUBLICATION

Whereas, OA 93/2022 was listed before Hon'ble presiding Officer / Registrar on 03/04/2023

Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said application under section 19 (4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 2,48,58,704/-** (application along with copies of documents etc annexed)

In accordance with sub-section (4) of section 19 of the Act, you the defendants are directed as under :-

(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.

(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.

(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.

(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.

(v) You shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets, and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before **Presiding Officer / Registrar on 03/04/2023 at 10.30 A.M.**

failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this date : 13/01/2023

Signature of the Officer
Authorised to issue PAPER PUBLICATION

రష్యా చైనా మధ్య వ్యూహాత్మక సమన్వయ భాగస్వామ్యం

- సంతకాలు చేసిన పుతిన్, జిన్‌పింగ్

మాస్కో : రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చైనా నేత జిన్‌పింగ్ క్రెమ్లిన్‌లో చర్చల అనంతరం సంయుక్తంగా మీడియా గోష్టిలో మాట్లాడారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సమన్వయం ద్వారా మంచి ఫలితాలను సాధించామని జిన్‌పింగ్ చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలు, ప్రధానమైన, పరస్పర ప్రయోజనకరమైన ప్రాంతీయ,అంతర్జాతీయ అంశాలపై కూలంకషంగా తాము చర్చించామని తెలిపారు. అనేక రంగాల్లో కీలకమైన ఉమ్మడి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ ఘర్షణను ఐరాస నియమావళికనుగుణంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. అమెరికా తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు అనుగుణంగా ప్రపంచ వ్యవస్థను నిర్దేశించాలని చూస్తుందని, దీనిని చైనా, రష్యా అంగీకరించే ప్రశ్నే లేదన్నారు. ఐరాస ఆధ్వర్యంలో నిబంధనలతో కూడిన ప్రపంచ క్రమాన్ని మాత్రమే తాము బలపరుస్తామని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. నూతన శకం కోసం ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య సమన్వయంపై ఇరువురు నేతలు ఒక సంయుక్త ప్రకటన విడుదలజేశారు. చైనా,రష్యా మధ్య సంబంధాలు ద్వైపాక్షిక పరిధిని దాటి అంతర్జాతీయ దృక్పథంతో, మానవాళి భవిష్యత్తుకు కీలక ప్రాధాన్యత ఇచ్చే స్థాయికి చేరిందని చైనా అధ్యక్షుడు చెప్పారు. ఉన్నత స్థాయి ప్రణాళికను బలోపేతం చేసుకునేందుకు, ఇంధన, వనరులు, కెమికల్ ఉత్పత్తుల రంగాల్లో వాణిజ్యాన్ని పెంపొందించేందుకు, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, వాణిజ్య రంగాల్లో సహకారాన్ని పెంపొందించేందుకు అంగీకారం కుదిరిందన్నారు. ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. భద్రతా మండలి శాశ్వత సభ్య దేశాలుగా అంతర్జాతీయ సమాజం అభ్యున్నతికి కృషి చేయాలని నిర్ణయించారు. బహుళ వ్యవస్థల చట్రపరిధిలో మరింత సన్నిహితంగా పనిచేసేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు.

క్యూబన్ బేస్‌బాల్ జట్టుపై అమెరికాలో దాడి

- ఖండించిన క్యూబా ప్రభుత్వం

హవానా : అమెరికాలో తమ నేషనల్ బేస్‌బాల్ బృందంపై జరిగిన దాడులను క్యూబా ప్రభుత్వం బుధవారం తీవ్రంగా ఖండించింది. ఫ్లోరిడాలోని మియామిలో 5వ ప్రపంచ బేస్‌బాల్ క్లాసిక్ ఛాంపియన్‌షిప్ పోటీల సందర్భంగా సెమీఫైనల్‌లో క్యూబా జట్టుకు వ్యతిరేకంగా దురదృష్టకరమైన, ప్రమాదకరమైన సంఘటనలు చోటు చేసుకున్నాయని, వీటిని క్యూబా తీవ్రంగా నిరసిస్తోందని క్యూబా విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రత్యక్ష దాడులు, బెదిరింపులు, దూషణలు, అసభ్య పదజాలం, నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలతో క్యూబా జట్టు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని ఆ ప్రకటన తెలిపింది. క్రీడాకారుల స్ఫూర్తిని దెబ్బతీయడమే వారి లక్ష్యంగా వుంది. స్టేడియం అధికారులు రూపొందించిన నిబంధనలు, ప్రవర్తనా నియమావళి వేటినీ అమెరికన్ అధికారులు పాటించలేదని ఆ ప్రకటనలో పేర్కొంది. కొంతమంది ప్రతినిధులు, క్రీడా సిబ్బంది, స్థానిక అధికారుల ఉదాసీనత ప్రదర్శించారని విమర్శించింది.క్యూబా క్రీడాకారులు, వారి కుటుంబాలు, క్యూబా మీడియా ప్రతినిధులు, చివరకు క్యూబా బృందం ఆట తీరుకు హర్షధ్వానాలు తెలియచేసే ప్రేక్షకులపై కూడా దాడులు జరిగాయని ఆ ప్రకటన పేర్కొంది.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసుర, మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత/సహా-రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది /డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	మహబూబ్ బాష షేక్/ సయీద అష్రఫ్/ LBGTR00001829164/ LBHYD00001833787	గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలో నిర్వహించిన టౌన్ సర్వే, బ్రాడీపేట, పాత వార్డు నం.2, కొత్త వార్డు నం.3, బ్లాక్ నం.5, టి.ఎస్.నం.324 విస్తీర్ణం 494.3/4 చ.గ.లు. పడమర వైపు విక్రయించిన 191 చ.గ.లు. మరియు తూర్పు వైపు మిగిలిన విస్తీర్ణం 303.3/4 చ.గ.లు. సైట్‌తో పాటు ఆర్‌సిసి దాబా ఇంటితో డో.నం.5-54-4 బేరింగ్ మూల్యాంకనం నం.3564 ఆస్తి హద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్డు, దక్షిణం: డా॥కొల్ల నాగేశ్వరరావు యొక్క ఆస్తి, పడమర: విక్రేత ద్వారా పెరుమాళ్ల సత్యనారాయణకు విక్రయించిన ఆస్తి, ఉత్తరం: కడియాల పరసురామయ్య యొక్క ఆస్తి మొదలైనవి./ లాంఛనప్రాయ స్వాధీనత 18.03.2023	10/10/2022 Rs. 3,10,626.00/-	గుంటూరు/ హైదరాబాద్

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యురిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 24 మార్చి, 2023, ప్రదేశం : గుంటూరు **ఆధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్**

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank **శాఖా కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసుర, మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణప్రాత/సహా-రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది /డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	కాసరగడ్డ నాగేశ్వరరావు/ కాసరగడ్డ సుధారాణి/ LBGTR00005043233 LBGTR00005052611	ఆస్తి షెడ్యూల్: గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ ఉపజిల్లాలోని వినుకొండ మున్సిపాలిటీ, వినుకొండ డో.నం.347/2-బి-1, విస్తీర్ణం ఎసి.0.92 సెంట్లు., బేరింగ్ డో.నం.29-197/5 మరియు మున్సిపల్ రికార్డు ప్రకారం ప్రస్తుత డో.నం.29-1060 దాబా ఇల్లు హద్దులు: తూర్పు: షేక్ ఆదం సాహెబ్ యొక్క ఇల్లు, ఉమ్మడి గోడ-50 అడుగులు., పడమర: సముద్రాల రామ బ్రంహం యొక్క సైట్-50 అడుగులు., ఉత్తరం: 30 లింకుల వెడల్పు యాక్సిస్ బజార్-13-3"., దక్షిణం: కొండపనేని సత్యనారాయణ యొక్క సైట్ 13'-3". ఈ సరిహద్దుల పరిధిలో 72.6 చ.గ.లు. సైట్ మరియు ఆ 612 చ.అ.లు. మరియు ఇతర సౌకర్యాలతో గ్రౌండ్, 1వ మరియు 2వ అంతస్తు ఇల్లు. / స్వాధీనతా తేది: 18.03.2023	18/10/2022/ Rs. 23,48,771.00/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యురిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 24 మార్చి, 2023
ప్రదేశం : గుంటూరు (వినుకొండ)
ఆధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్.

నాడు రూ.241.. నేడు రూ.1103

- 2004 నుంచి రూ.861 పెరిగిన వంట గ్యాస్ ధర
- పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి పాలనలో ఇంధన ధరలు హద్దేలేకుండా పెరిగిపోయాయి. బిజెపి అధికారంలోకి వచ్చేనాటికి వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.241 ఉండగా అదిప్పుడు ఏకంగా రూ.1103కు పెరిగింది. వంట గ్యాస్ ధరతో పాటు పెట్రోలు, డీజిల్, కిరోసిన్ ధరలు కూడా భారీగానే పెరుగుతూవచ్చాయి. ఈ విషయాన్ని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి రామేశ్వర్ తేలి గురువారం పార్లమెంటులో వెల్లడించారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2004 ఏప్రిల్ 1 నాటికి గ్యాస్ ధర రూ.241.60 ఉంటే, 2021 ఫిబ్రవరి 4 నాటికి రూ.719 పెరిగిందని, ప్రస్తుతం (2023 మార్చి 1) రూ.1,103కు చేరిందని తెలిపారు. అలాగే పెట్రోల్ లీటర్ రూ.33.71 ఉంటే రూ.63.01 పెరిగి రూ.96.72కి ఎగబాకిందన్నారు. కిరోసిన్ లీటర్ రూ.9.26 ఉండగా ఏకంగా రూ.62.83 పెరిగి రూ.72.09కు చేరిందన్నారు.

గ్యాస్ సబ్సిడీ రూ.44,647 కోట్ల తగ్గింపు

వంట గ్యాస్ సబ్సిడీ రూ.44,647 కోట్ల తగ్గించినట్లు కేంద్ర మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. 2013-14లో గ్యాస్ సబ్సిడీ రూ.46,458 కోట్లు ఉంటే, దాన్ని 2021-22 నాటికి రూ.1,811 కోట్లకు తగ్గించినట్లు పేర్కొన్నారు.

ఆందోళనకరంగానే నిరుద్యోగం

దేశంలో యువతలో 12.4 శాతం నిరుద్యోగ రేటు నమోదు అయిందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021-22లో 15-29 ఏళ్ల మధ్య యువతి, యువకుల్లో 12.4 శాతం నిరుద్యోగం రేటు నమోదు అయిందని తెలిపారు.

మైనార్టీ బడ్జెట్ రూ.2,407 కోట్లు తగ్గింపు

2022-23 బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి రూ.2,407.84 కోట్లు తగ్గించినట్లు కేంద్ర మైనార్టీ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022-23 బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి రూ.5,020.50 కోట్లు అంచనా వేశామని, అందులో రూ.2,612.66 కోట్లకు సవరించినట్లు తెలిపారు. గతేడాది బడ్జెట్‌లో సవరించిన బడ్జెట్ రూ.4,346.45 కోట్లు కాగా, ఈ ఏడాదిలో రూ.2,612.66 కోట్లకి తగ్గింది.

2026 తరువాతే నియోజకవర్గాల పునర్విభజన

2026 తరువాత జరిగే మొదటి జనాభా లెక్కల ప్రకారమే ఎంపి, ఎమ్మెల్యేల నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరుగుతోందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఎంపి జివిఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నియోజకవర్గాల సరిహద్దుల రీడిజైనింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర లేదని పేర్కొన్నారు.

వైసిపికి షాక్

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల అధికారులు ప్రకటించారు. పోలింగు పూర్తయిన తరువాత ఎన్నికల కమిషన్ నుండి కౌంటింగ్ అనుమతి కోసం ఎదురు చూశారు. ఐదు గంటల సమయానికి అనుమతి రావడంతో కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. తొలుత ఎనిమిది ట్రేలను ఏర్పాటు చేసి ఎన్నికల అధికారులు కౌంటింగ్ మొదలు పెట్టారు. తొలి ప్రయత్నంలోనే అనూరాధకు 23 ఓట్లు వచ్చాయి. దీంతో వైసిపి కంగుతిన్నది. తొలి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు అనంతరం చెవిరెడ్డి కౌంటింగ్ హాలు నుండి బయటకు వెళ్లిపోయారు. జయమంగళగ వెంకటరమణ, కోలా గురువులను రిటర్నింగ్ అధికారి కృష్ణబాబు పిలిచి రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్క పెడుతున్నట్లు ప్రకటించారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరు గెలుస్తారోననే తీవ్ర ఉత్కంఠ నేపథ్యంలో జయమంగళ వెంటకరమణ గెలుపొందినట్లు ప్రకటించారు.

రీ కౌంటింగ్‌లోనూ అదే ఫలితం

టిడిపి అభ్యర్థి అనూరాధకు వచ్చిన ఓట్లను లెక్కించాలని వైసిపి ఏజెంట్లు పట్టుబట్టడంతో రీకౌంటింగ్ నిర్వహించారు. అందులోనూ 23 ఓట్లు రావడంతో పోటీలో ఉన్న అందరి కంటే ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిగా అనూరాధ నిలిచారు. ఉదయం ఓట్లు వేసి వెళ్లే సమయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆత్మప్రభోదానుసారం ఓటు వేశానని ప్రకటించారు.

23...23...23

23వ తేదీన జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి 23 ఓట్లతో గెలుపొందిందని, టిడిపికి 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని కౌంటింగ్ అనంతరం అక్కడ పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇదే అంశంపై లోకేష్ కూడా ట్వీట్ చేశారు. నలుగురు ఎమ్మెల్యేలను లాక్కున్నా టిడిపి నాలుగు ఓట్లు టిడిపి వచ్చాయని పేర్కొన్నారు

ఎన్నిక ధ్రువీకరణ పత్రాలతో వైసిపి ఎమ్మెల్సీలు

ఇటువంటి వాటిలో చంద్రబాబు నేర్పరి : సజ్జల

ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు తన నేర్పరితనాన్ని చూపించారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కౌంటింగ్ అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని పోటీ పెట్టిన దగ్గర నుండి జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నామని, అయినా ఇలా ఎందుకు జరిగిందో విశ్లేషిస్తామని తెలిపారు. ఇలాంటి విషయాల్లో చంద్రబాబు నేర్పరి అని అన్నారు. కోటంరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి వారికి ఓట్లు వేస్తారని తెలుసని, అయినా మరికొన్ని ఓట్లు పడ్డాయని, అవి ఎలా జరిగిందో పరిశీలిస్తామని చెప్పారు.

ఆ నలుగురు

వైసిపికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు టిడిపికి ఓటు వేశారు. వాస్తవంగా టిడిపికి 23 మంది ఎమ్మెల్యేలు ఉండగా వారిలో కరణం బలరాం, వల్లభనేని వంశీమోహన్, మద్దాలి గిరి, వాసుపల్లి గణేష్ టిడిపిని వ్యతిరేకించి, వైసిపి అనుబంధ సభ్యులుగా మారారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి వైసిపిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేస్తామని ప్రకటించారు. అయితే ఇద్దరు సభ్యులు టిడిపికి ఓటు వేసినా తమ గెలుపుఖాయమనే ధీమాతో వైసిపి నాయకులు ఉన్నారు. వారితోపాటు మరో ఇద్దరు సభ్యులు క్రాస్ ఓటింగ్ చేయడంతో టిడిపి అభ్యర్థి గెలుపు ఖాయమైంది.

చంద్రబాబుకు కేక్ తినిపిస్తున్న అచ్చెన్నాయుడు

చంద్రబాబు ఇంట సంబరాలు

అనూరాధ గెలిచిన వెంటనే ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఎమ్మెల్యేలు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. రాజధాని ప్రాంత వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పెద్దఎత్తున టపాసులు కాల్చారు. మందడంలో మహిళలు శిబిరం వద్దకు చేరుకున్నారు. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద భారీ ఎత్తున బాణసంచా పేల్చారు. వైసిపిలో 16 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, కొంతమంది ఆత్మప్రబోధానసారం ఓట్లు వేశారని మాజీ మంత్రి చినరాజప్ప అన్నారు. శాసనమండలి ఎన్నికల్లోనూ మూడు స్థానాల్లో గెఉపొందామని, ఇప్పుడు ఎమ్మెల్యేల కోటా ఎన్నికల్లోనూ విజయం సాధించామని వైసిపిపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని అన్నారు. టిడిపి విజయపరంపర మొదలైందని, ఇక వైసిపి ప్రభుత్వ ఓటమి కోసం పోరాడాల్సిందేనని బాలకృష్ణ పేర్కొన్నారు. క్లిష్ట సమయంలో జరిగిన ఎన్నికల్లో టిడిపి గెలుపు పార్టీకి మంచి ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్నొన్నారు. తెలుగింటి ఆడపడుచు అనూరాధకు శుభాకాంక్షలు అంటూ నందమూరి రామకృష్ణ తెలిపారు.

HDB FINANCIAL SERVICES

హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.
రిజిష్టర్డు ఆఫీసు: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్డు, నవరంగపురం, అహ్మదాబాద్-09.
బ్రాంచి ఆఫీసు: 76-8-10/1, ఫ్లాట్ నం.4, భవాని టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, భవానిపురం, విజయవాడ-520012.

అమ్మకపు ప్రకటన

టు: 1. శ్రీ పద్మ ఎన్వలప్ & బైండింగ్ వర్క్స్, డోర్ నం.5-9.9సి, కెవిల్ రావు పార్క్ ప్రక్కన, రాజీవ్‌శర్మ నగర్, విజయవాడ హెచ్‌ఓ-520001. **2. లక్ష్మి రాల్లపూడి,** డోర్ నం. 9-41-110, ఆంజనేయ వాగు, కొత్తపేట, విజయవాడ హెచ్‌ఓ-520001. **3. శ్రీను రాల్లపూడి,** డోర్ నం. 9-41-110, ఆంజనేయ వాగు, కొత్తపేట, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001.

డియర్ సర్/మ్యాడం,

విషయం: తాకట్టుపెట్టిన ఆస్తి అమ్మకం కొరకు ప్రకటన-ఎల్‌ఓఎస్ ఐడి 13399343 మరియు 10053046.

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇందు తదుపరి "షార్ఫసీ యాక్ట్"గా పేర్కొనుట జరుగుతుంది) యొక్క సెక్షన్ 13(2) క్రింద మాచేత జారీచేయబడిన మా **తేది: 29.09.2021 నాటి డిమాండ్ నోటీసు** ను మేము రెఫర్‌చేస్తూ, ఏదైతే, సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులు (అరవై రోజులు)లోగా చెల్లించునాటికి తదుపరి వడ్డీతోసహా పూర్తి మొత్తాలు **రుణ ఖాతా నం.13399343 మరియు 10053046** లోకి సంబంధించి 16 మార్చి, 2023 నాటికి బకాయిగా **రూ.75,61,017/- (రూపాయలు డెబ్బై ఐదు లక్షల అరవై ఒక వేల పదిహేడు మాత్రమే)**ల బకాయిని తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది మరియు మీచేత **హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్** ద్వారా పొందిన ఆర్థిక సదుపాయలును **రుణ ఖాతా నంబరు 13399343 మరియు 10053046**కి సంబంధించి (ఇందు తదుపరి "బకాయి మొత్తాలు"గా పేర్కొనుట జరుగుతుంది" మీ అందరిచేత చెల్లించవలసిగా కోరబడినది. ఆ విధంగా డిమాండ్‌చేసినట్లుగా చెల్లించుటలో మీరు అశ్రద్ధవహించారు.

అట్టి బకాయి మొత్తాలను చెల్లించుటలో విఫలం చెందినందున, సదరు చట్టం యొక్క సెక్షన్ 14 క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ అనుబంధం "ఎ" (మరియు ఇందు తదుపరి "సెక్యూర్డ్ అసెట్స్"గా పేర్కొనబడుతుంది) లో ఇందు దిగువ వివరించిన ఆస్తుల యొక్క గౌరవ చీఫ్ జ్యూడిషల్ మజిస్ట్రేట్ విజయవాడ వారిచే జారీచేయబడినట్లుగా అడ్వకేట్ కమిషనర్ ద్వారా హెచ్‌డిబిఎఫ్ఎస్ యొక్క అధీకృత అధికారిచేత 10.09.2022న భౌతిక స్వాధీనం చేసుకోబడినది.

ఇందుమూలంగా మీకు తెలియజేయబడునది ఏమనగా, వడ్డీ& ఇతర చార్జీలతోపాటు పూర్తి బకాయి మొత్తాలను స్వీకరించుటకే, **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన ఈ నోటీసు తేదీ నుండి 15 రోజుల కాలవ్యవధి తరువాత, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1)తో రూల్ 8(5) యొక్క నియమాల క్రింద సిఫారసుచేసినట్లుగా బహిరంగ వేలం మరియు/లేదా ఇతర పద్దతుల ద్వారా ఇందు అనుబంధం "ఎ"లో పేర్కొన్నట్లుగా సెక్యూర్డ్ అసెట్‌ను విక్రయించుటకు క్రింది సంతకందారు ప్రతిపాదిస్తున్నారు.

(ఎ) రుణ ఖాతా నం. (బి) రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు/ హామీదారుల పేరు & చిరునామా / ఖాతా నం.	(సి) బకాయి మొత్తాలు	(డి) తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ (ఇ) తాకట్టుపెట్టిన ఆస్తి యొక్క రిజర్వు ధర (ఎఫ్) ధరావత్తు మొత్తాలు (జి) ధరావత్తు దాఖలుచేయుటకు చివరి తేది (హెచ్) వేలం తేది & సమయం
(ఎ) రుణ ఖాతా నం. 13399343, 10053046 (బి) 1. శ్రీ పద్మ ఎన్వలప్ & బైండింగ్ వర్క్స్, డోర్ నం.5-9.9సి, కెవిల్ రావు పార్క్ ప్రక్కన, రాజీవ్‌శర్మ నగర్, విజయవాడ హెచ్‌ఓ-520001. 2. లక్ష్మి రాల్లపూడి, డోర్ నం. 9-41-110, ఆంజనేయ వాగు, కొత్తపేట, విజయవాడ హెచ్‌ఓ-520001. 3. శ్రీను రాల్లపూడి, డోర్ నం. 9-41-110, ఆంజనేయ వాగు, కొత్తపేట, విజయవాడ, విజయవాడ హెచ్‌ఓ-520001.	(సి) సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులు (అరవై రోజులు)లోగా (ఇందు తదుపరి "బాకాయి మొత్తాలు"గా పేర్కొనుట జరుగుతుంది) రుణ ఖాతా నం.13399343 మరియు 10053046 కు సంబంధించి 16.03.2023 నాటికి రూ.75,61,017/- (రూపాయలు డెబ్బై ఐదు లక్షల అరవై ఒక వేల పదిహేడు మాత్రమే).	(డి) కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిల్లో, విజయవాడ, విద్యాధరపురం వద్దగల, డోర్ నం.4-4/2-14, అసెస్మెంట్ నం.1073011826, ప్రస్తుత వార్డు నం.32, తో ఆర్.ఎస్.40/1ఎ1 లో విద్యాధరంగా కలిగియున్న 119.37చ.గ.లు (99.80చ.మీ.లు)విస్తీర్ణంలో ఆస్తి యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు:** ఆర్‌సిసి రూఫ్ భవనము మరియు ఏసిసి షెడ్స్ మొ॥వాటితోపాటు 119.37చ.గ.లు (99.80చ.మీ.)ల సైటు **ఉత్తరం:** జనప జనార్ధన్ 36.10, **దక్షిణం:** ఈ ఆస్తి మరియు పూపడి రామారావు ఆస్థి మధ్య ఉమ్మడి గోడ 35.6, **తూర్పు:** మున్సిపల్ రోడ్డు 29.9.1/2, **పడమర:** రాయన పాపారావు మరియు గూడెల శ్రీను ఆస్తులు 29'.7.1/2. (ఇ) రూ.64,45,357/- (రూపాయలు అరవై నాలుగు లక్షల నలభై ఐదు వేల మూడు వందల యాభై ఏడు మాత్రమే) (ఎఫ్) రూ.6,44,535/- (రూపాయలు ఆరు లక్షల నలభై నాలుగు వేల ఐదు వందల ముప్పై ఐదు మాత్రమే) (జి) 10.04.2023 (హెచ్) 11.04.2023 సా॥ 5గం.ల వరకు

తేది: 24.03.2023
ప్రదేశం:విజయవాడ
సం/- అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

మీకోసం

సాంబారు మరుగుతున్నప్పుడు ఒక చెంచా నిమ్మరసం కలిపితే చాలా రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

జీవితంలో గెలుస్తామా ఓడిపోతామా అనేది ముఖ్యం కాదు. సరైన దారిలో ప్రయాణిస్తున్నామా? లేదా అనేది చాలా ముఖ్యం. గెలుపు కంటే పోరాటం గొప్పది.

JEEVANA జీవన the family

క్షయ వ్యాధి నివారణ దినం

పిల్లలూ, ఈ రోజు క్షయ వ్యాధి, దాని లక్షణాలు, నివారణ గురించి తెలుసుకుందామా!

క్షయ ఒక అంటువ్యాధి. ఇది ఊపిరితిత్తులకు సంబంధించినదైనా, చర్మం నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉంది. మనదేశంలో దీర్ఘకాలిక రోగాల్లో ప్రధానమైనది. మైకోబాక్టీరియా లేదా మైకో బ్యాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ అనే సూక్ష్మక్రిమి వల్ల ఇది వస్తుంది. క్షయవ్యాధి సోకని శరీరావయవాలు క్లోమం, థైరాయిడ్ గ్రంథి, జుట్టు. ఈ వ్యాధి శ్వాసకోశాలను, ఊపిరితిత్తులను దెబ్బతీస్తుంది.

డాక్టర్ రాబర్ట్ కోచ్ ఈ క్షయ వ్యాధి కారక సూక్ష్మ క్రిములను మొదటిసారిగా మార్చి 24న, 1882న గుర్తించారు. ఇందుకుగానూ ఆయనకు 1905లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ప్రతి సంవత్సరం మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవంగా పాటిస్తారు. కొద్ది నెలల తేడాలోనే బరువు తగ్గిపోవడం, రాత్రి పూట స్వల్ప స్థాయిలో జ్వరం, జ్వరం వచ్చినప్పుడు బాగా చెమట పట్టడం, నెలల తరబడి తగ్గని దగ్గు క్షయ వ్యాధి ముఖ్య లక్షణాలు.

రోగుల నుంచి నమూనాలు సేకరించి, పరిశోధనశాల్లో బ్యాక్టీరియాను ఒక గంటలో గుర్తించే విధంగా డీఎన్ఏ ఆధారిత పద్ధతిని బ్రిటన్ హెల్త్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హెచ్‌పీఏ) శాస్త్రవేత్తలు కనిపెట్టారు. దీంతో రోగనిర్ధారణ పరీక్ష త్వరగా అయిపోతుంది. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో, పోషకాహార లోపం, మధుమేహ వ్యాధి బారిన ఉన్నవారు, పొగాకు ఉపయోగించే వ్యక్తుల్లో టిబి త్వరగా సోకుతుంది. వైద్యులు సూచించినట్లు మందులు వాడితే త్వరగా తగ్గిపోతుంది. ఐక్యరాజ్య సమితి సూచన మేరకు ప్రపంచ దేశాలు ప్రతి ఏడాది ఈ వ్యాధి నివారణ చర్యలు విస్తృతంగా చేపట్టాయి. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య బాగా తగ్గింది.

దారి చూపండి



చిన్నారులూ, అంబులెన్స్‌లో పేషెంట్‌కు వైద్యం చేయాలి. మరి డాక్టర్ దగ్గరకు వెళ్లాలి. త్వరగా దారి చూపరూ?

నేను గీసిన బొమ్మ

- వై. శ్రీలత,
3వ తరగతి,
పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల,
తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మ భాష పరిరక్షణ కోసం ...

మన రాజ్యాంగంలో 22 భాషలు అధికార భాషలుగా గుర్తింపు పొందాయి. వాటిలో ఒకటే సంథాలీ (సంతాలి అని కూడా పిలుస్తారు). ఈ ఆదివాసీ భాష మన రాజ్యాంగంలో 22వ అధికార భాషగా ఉంది. ఇది బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ దేశాల్లో కూడా అధికార భాషగా గుర్తింపు పొందింది. అయితే మారుతున్న జీవనశైలిలో భాగంగా ఈ భాష వినిమయం తగ్గుతూ వస్తోంది. అయితే, ఒడిశాకు చెందిన మాలతీ ముర్ము ... ఈ భాష పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తున్నారు. తన మాతృభాషను బతికించుకునేందుకు 15 ఏళ్లుగా సంతాలీ భాషలో ఒక పత్రికను నడుపుతున్నారు.

ఒడిశాలో సంతాలీ తెగ ఆదివాసీలు పెద్ద సంఖ్యలో నివసిస్తున్నారు. 'ముండా' జాతి సమూహంగా గుర్తించిన వీరు దేశవ్యాప్తంగా జార్ఖండ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్, అస్సాం, మిజోరం, త్రిపురలో కూడా స్థిరపడ్డారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వీరి జనాభా 70 లక్షలు పైగానే ఉంది.

19వ శతాబ్దం వరకు బలమైన సంస్కృతి ఉన్న భాషగా గుర్తించబడిన సంథాలీకి లిపి లేదు. బెంగాలీ, దేవనాగరి, ఒడియా లిపిలతో దీన్ని సరిపోల్చలేకపోయారు. దీంతో 1925లో అప్పటికి 20 ఏళ్ల వయసువాడైన రఘునాథ్ సంథాలీకి లిపిని కనుగొన్నారు. అలా 30 అక్షరాలతో 'ఓల్ చికి' లిపిని ప్రవేశపెట్టారు.

'భూమి, వంగిన చెట్లు, పొంగిపొర్లే ప్రవాహాల మాదిరి మా లిపి ఉంటుంది. మొత్తం 30 అక్షరాలతో కూర్చబడిన 'ఓల్ చికి' లిపి మాది. 1925లో ప్రముఖ రచయిత, విద్యావేత్త అయిన మా తాత రఘునాథ్ ముర్ము ఓల్ చికీ లిపిని కనుగొని విస్తృతంగా ప్రచారం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జార్ఖండ్ జంషెడ్‌పూర్‌లో స్థిరపడిన ఆయన రోజంతా ఊరూరు తిరుగుతూ 'ఓల్ చికి' భాషలో పాటలు పాడేవారు. గోడల మీద చిన్న చిన్న రచనలు చేసేవారు. ఆ కార్యక్రమం ముగిసిన తరువాతే ఇంటికి వచ్చి భోజనం చేసేవారు. ఆ తరువాత ఇంట్లో పిల్లలందరికీ ఆ లిపిని నేర్పించేవారు. మా అమ్మ కూడా అలాగే నేర్చుకుందని నాతో చాలాసార్లు చెప్పింది' అంటూ తన పూర్వీకులకు మాతృభాషపై ఉన్న మక్కువ గురించి చెబుతారు మాలతి.

తక్కువ మొత్తంతో..

తాతముత్తాతల నుంచి అబ్బిన ఆ వారసత్వమే ఆమెను 'ఓల్ చికి' భాషలో ఓ మాసపత్రిక తెచ్చేందుకు ప్రోత్సహించాయనుకోవచ్చు. రూ.12 వేలతో 2008 ఏప్రిల్ 10న మాలతి, ఆమె భర్త మంగట్ ముర్ము 'ఫాగుణ్'ను ప్రారంభించారు. మొదట 500 కాపీలతో ప్రచురితమైన ఈ పత్రిక ఆ తరువాత 5 వేల కాపీల వరకు అచ్చయ్యింది. దేశంలోని సంథాలీలనే కాదు, విదేశాల్లో స్థిరపడ్డ వారిని అనుసంధానం చేసేలా 'ఫాగుణ్' నడిపించడంలో మాలతి కృషి వెలకట్టలేనిది.



అండమాన్ నికోబార్ దీవులు, భగల్‌పూర్, చెన్నయ్, కటక్, దుమ్కా, ఢిల్లీ, గుహవటి, జగ్దల్‌పూర్, కోలకత్తా, ముంబయి, పూరీ, రాంచీ, విశాఖపట్నంలో 'ఫాగుణ్' పాఠకులున్నారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఫైనాన్స్ మినిస్ట్రీ, ఇరిగేషన్ మినిస్ట్రీ, ట్రైబల్ మినిస్ట్రీ, జార్ఖండ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, అస్సాం ముఖ్యమంత్రి, గవర్నరు కార్యాలయాలు, ఒరిస్సా రాష్ట్ర మొత్తం 'ఫాగుణ్' సర్క్యులేట్ అవుతోంది.



మాలతి గురించి మరికొంత..

ఒడిశాలోని గాయల్‌కోటలో జన్మించిన మాలతి ముర్ము మెట్రిక్యులేషన్ 1991లో పూర్తయింది. అప్పటికి సంథాలీని రాజ్యాంగంలో చేర్చలేదు. అయినా మాలతి తన తల్లి నుంచి 'ఓల్ చికి' లిపిని నేర్చుకున్నారు. అలా ఒకపక్క పరభాషలో విద్యాభ్యాసం, మరోపక్క మాతృభాషపై పట్టు సాధించారు. స్కూలు విద్య పూర్తయ్యేసరికి మాలతికి మంగట్ ముర్ముతో వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో వివాహానంతరం ఆమె ఉన్నత చదువులు చదివారు.

'సంతాలి మూలాలకు చెందిన వారంతా మా సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు 'ఓల్ చికి' లిపిని నేర్చుకోవాలన్నదే నా కోరిక. సమాజంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మా తెగ వారు కూడా ఉద్యోగాలు, వివాహాలతో మా సంస్కృతి నుంచి దూరంగా వెళ్లిపోయారు. వారందరికీ నేను చెప్పేదొకటే.. మూలాలతో సన్నిహితంగా ఉండడం వల్ల వారి సామాజిక స్థితికి చేటు రాదు. ఇది వారు అర్థం చేసుకోవాలి' అంటారు మాలతి.

'మా సంథాలీలో జూన్ 30న పెద్ద ఎత్తున ఉత్సవం నిర్వహిస్తారు. బ్రిటీష్ కంపెనీ, భారత జమీందారీ వ్యవస్థను వ్యతిరేకిస్తూ 1855 నుంచి ఈ పండుగ జరుపుకుంటున్నారు. దీనిని ప్రధాన స్రవంతి మీడియా ప్రచారం చేయదు. అటువంటి ఎన్నో విషయాలు.. 'ఫాగుణ్'లో ప్రచురిస్తాం. 'ఓల్ చికి' కనుగొన్న శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని 'మిషన్ ఓల్ చికి 2025'ని ప్రచారం చేస్తున్నాం. దీని ద్వారా ఆసక్తి ఉన్న పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఈ లిపిని నేర్పించాలని లక్ష్యం పెట్టుకున్నాం' అని చెబుతున్నారు మాలతి.

కంటినిండా నిద్ర కోసం..

నిద్ర ఆరోగ్యానికి చాలా అవసరం. సరిపడా నిద్రపోతే మనసు ప్రశాంతంగా తెలికగా ఉంటుంది. ఏ పనిచేయడానికైనా శరీరం సహకరిస్తుంది. ఒత్తిడి, మానసిక ఆందోళన లేకున్నా నిద్రపట్టదు. దీన్ని నుంచి బయటపడాలంటే కొన్ని చిట్కాలు పాటిస్తే నిద్ర లేని సమస్య తొలగిపోతుంది.

గుమ్మడి గింజలు : గుమ్మడి గింజల్లో ట్రిప్టోఫాన్‌తో పాటు జింక్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ రెండూ సెరటోనిన్‌ను ఉత్పత్తిలో సహాయపడతాయి. సెరటోనిన్ నిద్రను మెరుగుపరుస్తుంది.

అశ్వగంధ: అశ్వగంధలో ట్రై ఎథిలిన్ గ్లైకాల్ ఉంటుంది. ఇది నిద్ర నాణ్యతను మెరుగుపర్చడంలో తోడ్పడుతుంది. పడుకోవడానికి 30 నిమిషాలు ముందు అశ్వగంధను తీసుకుంటే మంచి నిద్ర పడుతుంది.

బాదాం: బాదాంలో ఫైబర్, మంచి కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. బాదాంలో మెగ్నీషియం అధికం. నిద్ర సహాయక కారకం అయిన మెలటోనిన్ నియంత్రణకు మెగ్నీషియం అవసరం. మెగ్నీషియం మీ కండరాలను కూడా సడలింపజేస్తుంది. ఫలితంగా నిద్ర బాగా పడుతుంది.

జాజికాయ పాలు: ఒక గ్లాసు పాలలో చిటికెడు జాజికాయ కలిపి తీసుకోవడంవల్ల నిద్ర మెరుగుపడుతుంది. పాలలో ట్రిప్టోఫాన్ ఉంటుంది. ఇది శరీరంలో సెరటోనిన్, మెలటోనిన్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. ఈ రెండూ మంచి నిద్రకు తోడ్పడుతాయి.

కుల దురహంకార హత్యల నిరోధానికి చర్యలు

తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్

చెన్నై : కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. గురువారం నాడు ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ కుల దురహంకార హత్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రేమ వివాహాలు చేసుకున్నవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కుల దురహంకార హత్యలను నిరోధించే చర్యల్లో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఇటీవల కృష్ణగిరి జిల్లాలో కావేరిపట్నంలో జగన్ అనే యువకున్ని అతని మామే కొందరి వ్యక్తులతో కలిసి హత్య చేసిన సంఘటనపై మాజీ ముఖ్యమంత్రి ఇకె పళినిస్వామి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ స్టాలిన్ ఈ వివరాలు తెలిపారు. 'సామాజిక న్యాయానికి భూమి అయిన తమిళ నాడులో ఇలాంటి సంఘటనలను నిరోధించడానికి అసెంబ్లీలో ఉన్న సభ్యులందరూ పార్టీలకు అతీతంగా కలిసిరావాలి' అని స్టాలిన్ కోరారు.

పరీక్షల సమయంలో వద్దు

కర్ణాటక రవాణా శాఖ సమ్మెపై హైకోర్టు

బెంగళూరు : కర్ణాటకలో బిజెపి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆ రాష్ట్ర రవాణా శాఖ ఉద్యోగుల సమాఖ్య నిర్వహించతలపెట్టిన సమ్మెకు హైకోర్టు ఆంక్షలు విధించింది. ఈ మేరకు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న వి వరాలే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వేతనాల పెంపు, ఇతర సమస్యలపై ఈ నెల 24 (శుక్రవారం) నుంచి మూడు వారాల పాటు సమ్మె చేపట్టాలని రవాణా శాఖ ఉద్యోగులు, కార్మికులు నిర్ణయించారు. అయితే పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని వాయిదా వేసుకునేలా కార్మిక సంఘాలు ఆదేశాలివ్వాలంటూ పలువురు ఉన్నతన్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు సమ్మెను నిలిపేసి విధులకు హాజరవ్వాల్సిందిగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ఉద్యోగ, కార్మిక సంఘాలతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపకూడదనే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ధర్మాసనం తెలిపింది. అయితే ఏప్రిల్ 6న కార్మిక శాఖ కమిషనర్, ఉద్యోగుల నాయకుల మధ్య జరిగే చర్చలకు ఈ ఉత్తర్వులు అడ్డంకి కాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

మాల్యాతో ఐడిబిఐ మాజీ జిఎం కుమ్మక్కు

సిబిఐ అనుబంధ చార్జిషీట్ దాఖలు

ముంబయి : కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు రుణాన్ని మంజూరు చేయడం కోసం ఐడిబిఐ బ్యాంక్ మాజీ జిఎం వ్యాపారవేత్త విజయ్ మాల్యాతో కుమ్మక్కయ్యారని సిబిఐ తెలిపింది. ఈ మేరకు ముంబయి లోని సిబిఐ ప్రత్యేక కోర్టులో అనుబంధ చార్జిషీట్‌ను దాఖలు చేసింది. రూ.900కోట్ల రుణం అవినీతి కేసులో విజయ్‌మాల్యా నిందితుడుగా వున్నాడు. ఐడిబిఐ బ్యాంక్-కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణంలో అవినీతి, అవకతవకలపై సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ఐడిబిఐ బ్యాంక్ మాజీ జనరల్ మేనేజర్ బుద్ధదేవ్ దాస్‌గుప్తా తన పదవిని దుర్వినియోగం చేశారని, విజయ్‌మాల్యాతో తన సహచరులతో కుమ్మక్కై, 2009 అక్టోబరులో రూ.150కోట్ల మేరకు స్వల్పకాలిక రుణాన్ని మంజూరు చేశారని సిబిఐ తెలిపింది. ఈ కేసులో గతంలో దాఖలైన చార్జిషీట్లలో 11మంది నిందితుల పేర్లతో పాటూ కొత్తగా దాస్‌గుప్తా పేరును చేరుస్తూ అనుబంధ చార్జిషీట్‌ను సిబిఐ దాఖలు చేసింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ వాస్తవంగా కోరిన రూ.750 కోట్ల రుణంలో భాగంగానే ఈ రూ.150కోట్ల రుణం మంజూరైంది.

ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావాలి

పిడిపి చీఫ్ మెహబూబా

శ్రీనగర్ : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి గట్టి పోటీ ఇచ్చేందుకు గానూ ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపై నిలబడాలని పిడిపి చీఫ్ మెహబూబా ముఫ్తి పేర్కొన్నారు. అయితే అలాంటి కూటమి ఉనికిలోకి రావడంపై పలు సందేహాలు వ్యక్తం చేశారు. పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, ప్రతిపక్షాల కూటమికి కాంగ్రెస్ ప్రధాన కేంద్రంగా వుండాలన్నారు. అయితే, అది జరగకుండా వుండేలా బిజెపి ప్రతిపక్షాలను చీలుస్తోందన్నారు.

సిబిఐ నిర్వహణకు కొత్త చట్టం అవశ్యం

పార్లమెంటరీ కమిటీ సిఫార్సు

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ విధి విధానాలను నిర్దేశించే ప్రస్తుత చట్టానికి అనేక పరిమితులు వున్నాయని అందువల్ల కొత్తగా సిబిఐ కార్యకలాపాలను, హోదాను, అధికారాలను నిర్వచించేందుకు కొత్త చట్టం రూపొందించాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. సిబిఐ దర్యాప్తుకు సాధారణ అనుమతిని అనేక రాష్ట్రాలు ఉపసంహరించుకోవడాన్ని కమిటీ ప్రముఖంగా ప్రస్తావించింది. 1963లో సిబిఐ ఏర్పడింది. ఢిల్లీ ప్రత్యేక పోలీసు అధికారాల (డిఎస్‌పిఇ) చట్టం కింద దీనికి విధి విధానాలు నిర్దేశించారు. సిబిఐ ఏ దర్యాప్తు చేపట్టాలన్నా ముందుగా ఆయా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరం. అయితే, 9 రాష్ట్రాలు ఇటువంటి సాధారణ అనుమతిని ఇప్పటికే ఉపసంహరించాయి. పైగా ఢిల్లీ ప్రత్యేక పోలీసు అధికారాల చట్టానికి అనేక పరిమితులున్నందున ముందుగా ఈ సంస్థ పనితీరులో నిష్పాక్షికతకు హామీ కల్పించేందుకు గానూ కొన్ని రక్షణలు కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందని, అలాగే అధికారాలను, హోదాను కూడా నిర్వచించాల్సిన అవసరం వుందని కమిటీ సిఫార్సు చేసింది. అవసరమైనంత వేగంగా సిబిఐలో ఖాళీలను భర్తీ చేయడం లేదని పేర్కొంది. సాధ్యమైనంత త్వరగా ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది.

27న కవిత పిటిషన్ విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పిటిషన్ ఈనెల 27న సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. సుప్రీంకోర్టు కాజ్ లిస్ట్‌లో కవిత పిటిషన్ ఉంది. మహిళల విచారణపై ఈడికి తగిన ఆదేశాలు ఇవ్వాలంటూ సుప్రీంలో కవిత ఈ నెల 15న పిటిషన్ దాఖలు చేశారు. కవిత పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా త్రివేదిల ధర్మాసనం విచారణ జరపనుంది. కవిత పిటిషన్‌పై ఈనెల 24నే విచారిస్తామంటూ మొదట తెలిపిన సిజెఐ ధర్మాసనం ఆ తరువాత 27 నాటికి మార్చింది.

మాగుంట బెయిల్ విచారణ వాయిదా

పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి కుమారుడు మాగుంట రాఘవ్ బెయిల్‌పై విచారణ ఈ నెల 25కు వాయిదా పడింది. గురువారం రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు జడ్జి ఎంకె నాగ్‌పాల్ మాగుంట రాఘవ్ బెయిల్ పిటిషన్ విచారించారు. పిటిషన్ విచారణకు వచ్చినప్పటికీ తీహార్ జైలు అధికారులు రాఘవ్‌ను వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరు పరచలేదు. రాఘవ్‌ను శనివారం విసి ద్వారా హాజరుపర్చాలని ఆదేశించారు. కేసు తదుపరి విచారణను 25కి వాయిదా వేశారు.

సాంఘ్వాన్-థోమర్ జంటకు రజితం

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్



భోపాల్: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ షూటింగ్ పోటీల్లో భారత్‌కు నేడు ఒక రజత, ఇక కాంస్య పతకాలు దక్కాయి. గురువారం జరిగిన 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో సాంఘ్వాన్-థోమర్ జంట రజిత పతకాన్ని సాధించగా.. 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో రుద్రాక్ష-నర్మద జోడీ కాంస్య పతకాన్ని గెలిచింది. 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో 19ఏళ్ల రైథమ్ సంఘ్వాన్ చివర్లో టార్గెట్‌ను ఛేదించడంలో విఫలమైంది. బుధవారం జరిగిన వ్యక్తిగత విభాగంలో 572 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచిన సంఘ్వాన్.. నేడు మిక్స్‌డ్ విభాగంలో మెరుగైన ప్రదర్శనను కనబరచడం విశేషం. ఇక వరుణ్ థోమర్ ప్రారంభం నుంచే టార్గెట్స్‌ను సంధిస్తూ రజిత పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ విభాగంలో చైనాకు స్వర్ణ, కాంస్య పతకాలు దక్కాయి. ఇక 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన రుద్రాక్ష బాలాసాహెబ్ పాటిల్-నర్మదా నితిన్ జోడీ కాంస్య పతకంతో సరిపుచ్చుకుంది. ఈ విభాగంలో చైనాకు స్వర్ణం, హంగేరీకి కాంస్య పతకాలు దక్కాయి. షూటింగ్ ప్రపంచకప్ పోటీల్లో భారత్ ఒక్కో స్వర్ణ, రజిత, పతకాలతోపాటు రెండు కాంస్యాలు దక్కగా.. చైనా మూడు స్వర్ణ, రెండు రజిత పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

ఫైనల్‌కు నిఖత్, లౌలీనా

నీతూ, స్వీటీ బూర కూడా..

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లోకి భారత బాక్సర్లు నలుగురు ప్రవేశించారు. గురువారం జరిగిన సెమీస్ పోటీల్లో నిఖత్ జరీన్(50కిలోలు), లౌలీనా బోర్గోహైన్(75) ప్రత్యర్థులపై గెలిచి ఫైనల్ చేరారు. అలాగే నీతూ ఘంగాస్ (48కిలోలు), స్వీటీ బూరా(81కిలోలు) కూడా సెమీస్‌లో గెలిచారు. నిఖత్.. రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, కొలంబియాకు చెందిన ఇంగ్రిట్ వలెన్సియాపై 5-0తో, లౌల్లీనా 4-1తో లీ ఖిన్(చైనా)పై, నీతూ 5-2తో బల్కెబెకోవా(కజకిస్తాన్)పై, స్వీటీ 4-3తో ఎమ్మా సూ(ఆస్ట్రేలియా)పై గెలిచారు. ఫైనల్లో నిఖత్.. టామ్ నియోన్(వియత్నాం)తో తలపడనుంది.

ప్రి క్వార్టర్స్‌కు సింధు, ప్రణయ్

బస్సెల్(స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి భారత స్టార్ షట్లర్లు పివి సింధు, హెచ్ఎస్ ప్రణయ్‌రాయ్ ప్రవేశించారు. డిఫెండింగ్ ఛాంపియన్ పివి సింధు 21-9 21-16తో జెంజిరా స్టాడెల్మన్(స్విట్జర్లాండ్)ను వరుససెట్లలో చిత్తు చేసింది. తొలి గేమ్‌ను సునాయాసంగా గెలిచిన సింధు.. రెండో గేమ్‌లో స్థానిక క్రీడాకారిణినుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. అయినా ఆ గేమ్‌ను చేజిక్కించుకొని సింధు సత్తా చాటింది. ప్రి క్వార్టర్స్‌లో సింధు.. ఒలింపిక్ విజేత ఇండోనేషియాకు చెందిన పుత్రి కుసుమ వర్ధానీతో తలపడనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ 9వ ర్యాంకర్ హెచ్ఎస్ ప్రణయ్ 21-17 19-21 21-17తో ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఫైనలిస్ట్ షి యు కి(చైనా)పై గెలుపొందాడు. ప్రణయ్ ప్రి క్వార్టర్స్‌లో క్రిస్టో పొపోవ్(ఫ్రాన్స్)తో అమీ తుమీ తేల్చుకోనున్నాడు. మరో పోటీలో కిదాంబి శ్రీకాంత్ 20-22, 17-21తో కెనడాకు చెందిన లీ-చెక్-యూ చేతిలో, మిథున్ మంజునాథ్ 19-21, 19-21తో ఛియా-హో-లీ(చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడారు. ఇక పురుషుల డబుల్స్‌లో చిరాగ్‌శెట్టి-సాత్విక్ సాయిరాజ్ జోడీ 21-15, 21-18తో అమెరికా జోడీపై గెలిచి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు.

మదెవెరె హ్యాట్రిక్

ఉత్కంఠ పోరులో నెదర్లాండ్స్‌పై ఒక్క పరుగు తేడాతో జింబాబ్వే గెలుపు

హరారే: జింబాబ్వే ఆల్‌రౌండర్ మదెవెరె హ్యాట్రిక్‌తో సత్తా చాటడంతో నెదర్లాండ్స్‌తో గురువారం జరిగిన రెండో వన్డేలో జింబాబ్వే ఒక్క పరుగు తేడాతో గెలిచింది. నెదర్లాండ్స్ 272పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 44వ ఓవర్‌లో మదెవెరె తొలి 3 బంతులకు 3 వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. తొలి బంతికి ఆకెర్‌మన్‌ను స్టంపౌట్ కాగా.. ఆతర్వాత బంతికి ఎన్. తేజ, మూడో బంతికి వాన్ మీకెరెన్‌ను క్లీన్ బౌల్డ్ అయ్యారు. నెదర్లాండ్స్ చివరి 6బంతుల్లో 19 పరుగులు చేయాల్సిన దశలో ర్యాన్ క్లెయిన్, క్లాసెన్ అద్భుతంగా పోరాడి 17పరుగులు కొట్టారు. ఆఖరి బంతికి బౌండరీ సాధించాల్సి ఉండగా.. ర్యాన్ 2 పరుగులు తీసి రనౌట్ కావడంతో జింబాబ్వే పరుగు తేడాతో బయటపడింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా ఉండగా.. మార్చి 25న మూడో వన్డే జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మధెవెరెకు దక్కింది.

ఒత్తిడి జయించాలి

టీమిండియా కెప్టెన్ రోహిత్

ముంబయి: ఇండియన్ ప్రిమియర్‌లీగ్(ఐపిఎల్)లో టీమిండియా ఆటగాళ్లు ఒత్తిడిని జయించడం నేర్చుకోవాలని హితవు పలికాడు. చెన్నై వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడో, చివరి వన్డేలో ఓటమికి ఒత్తిడే ప్రధాన కారణంగా చెప్పుకొచ్చాడు. సరైన మిడిలార్డర్ బ్యాటర్ క్రీజ్‌లో నిలదొక్కుకొని ఆడితే ఫలితం మరోలా ఉండేదని చెప్పుకొచ్చాడు. సూర్యకుమార్ యాదవ్ వరుసగా మూడు వన్డేలో తొలి బంతికే ఔటవ్వడం, మరో నాణ్యమైన మిడిలార్డర్ బ్యాటర్ లేకపోవడం వన్డే సిరీస్ ఓటమికి ప్రధాన కారణాలుగా చెప్పుకొచ్చాడు. మూడో వన్డేలో ఆస్ట్రేలియా నిర్దేశించిన లక్ష్యం ఛేదించదగ్గదే అయినప్పటికీ.. నాణ్యమైన మిడిలార్డర్ బ్యాటర్ ఒకరు లేకపోయారన్నాడు. శ్రేయస్ అయ్యర్ లేని లోటు స్పష్టంగా కనబడిందని, రాబోయే టోర్నీల్లో మరింత మెరుగైన ప్రదర్శనను కనబరుస్తామని రోహిత్ శర్మ అన్నాడు. అలాగే వచ్చే ఐపిఎల్‌లో ఆటగాళ్లంతా పనిభారాన్ని సాధ్యమైనంతవరకు తగ్గించుకొని ఈ ఏడాది ఆఖర్లో జరిగే ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు సిద్ధం కావాలన్నాడు. భారత్ తొలిసారి ఒంటరిగా టోర్నీకి ఆతిథ్యమిస్తోందన్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68